

రామకుప్పం మండలం పంద్యాల మడుగు జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఏఎల్ఎస్వో నరోత్తమ రెడ్డి తదితరులు

పరీక్షలు దగ్గర పడుతున్నా

- వార్షిక పరీక్షలకు మిగిలింది నెలన్నర గడువే
- ఇప్పుడు ఏబీసీ గ్రేడ్ల విభజనపై విమర్శలు
- సబ్జెక్టు టీచర్లు లేకపోవడంపై సాగిన చర్చ
- వాడివేడిగా స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు

పూర్తి కాని సిలబస్..!

చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా పాఠశాలల్లో శనివారం నిర్వహించిన మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశాలు వాడివేడిగా సాగాయి.పాఠశాల హెచ్ఎంల ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశాల్లో కమిటీ ఛైర్మన్లు, సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. గతంలో నెలకు రెండు సార్లు ఈ సమావేశాలు జరుగుతున్నా ప్రయోజనం కన్పించకపోవడంతో ఈ నెల నుంచి ప్రతి మూడో శనివారం పకడ్బందీగా నిర్వహించాలని విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు ఆదేశాలిచ్చారు. జిల్లావ్యాప్తంగా వున్న 2466 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలను 148క్లస్టర్లుగా విభజించారు. ఆయా క్లస్టర్ పరిధిలో హెచ్ఎం నోడల్ అధికారిగా వ్యవహరించగా ప్రతి స్కూల్ కాంప్లెక్స్‌కు ఒక పరిశీలకుడిని నియమించారు. జిల్లావ్యాప్తంగా జరిగిన సమావేశాలను సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటరమణ పర్యవేక్షించారు.మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సాగిన సమావేశాల్లో తొలుత కమిషనర్ విజయరామరాజు సెట్ కాన్ఫరెన్స్ ద్వారా స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలకు సంబంధించి వచ్చిన సమస్యలకు సమాధానాలు చెప్పడంతో పాటు సమావేశాల అనంతరం విద్యార్థుల విద్యాభ్యాసం, టీచర్ల బోధన అంశాలపై వివరణ తీసుకున్నారు.త్వరలో రానున్న మోడల్ స్కూళ్ల వ్యవస్థపై అవగాహన కల్పించారు.ప్రతి పంచాయతీలో మోడల్ ప్రాథమిక పాఠశాలలతో విద్యా వ్యవస్థ బలోపేతం కానుందన్నారు.తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా మోడల్ ప్రాథమిక పాఠశాలలు రూపుదిద్దుకోనున్నాయని తెలిపారు.మోడల్ పాఠశాలలకు వెళ్లే పక్క పాఠశాలల పిల్లలకు రవాణా ఛార్జీల కింద నెలకు రూ.600 ప్రభుత్వం చెలిస్తుందన్నారు.కాగా స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో ఎక్కువ శాతం సిలబస్‌పై దృష్టి సారించారు. ఒకటవ తరగతి నుంచి టెన్త్ వరకు ప్రతి సబ్జెక్టులో ఎంత వరకు సిలబస్ పూర్తి చేశారనేది ప్రధానాంశంగా సమావేశాలు సాగాయి. టెన్త్ పబ్లిక్ పరీక్షలు మార్చి 17 నుంచి జరగనున్న నేపథ్యంలో వంద శాతం సిలబస్ పూర్తి చేసినా, పలు సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించలేదనే వాదనలు వినిపిస్తున్నాయి. మిగిలిన తరగతులకు సంబంధించి ఇప్పటి వరకు 75 శాతం సిలబస్ పూర్తి చేయడంపై అధికారులు అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. అంతే కాకుండా వార్షిక పరీక్షలకు కేవలం నెలన్నర మాత్రమే గడువుండడంతో ఇప్పుడు విద్యార్థులను వారి సామర్థ్యాల ఆధారంగా ఏబీసీడీ గ్రేడ్లుగా విభజించడంపై విమర్శలున్నాయి. సీ,డీ గ్రేడ్ విద్యార్థులపై దృష్టి సారించే టీచర్లకు అధికారులు పలు సూచనలు చేశారు. పలు పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లు లేకపోవడంపైనా చర్చ సాగింది.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడానికి కారణాలు, వాటిని అధిగమించడానికి తీసుకునే చర్యలను రికార్డు చేశారు. పాఠశాలల్లో ట్యాబ్‌లు, ఇంటర్నెట్ పనితీరుకు సంబంధించి పలు చోట్ల తలెత్తిన సాంకేతిక సమస్యలు పరిష్కరించడంపై చర్యలు చేపట్టేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఉపాధ్యాయుల బోధన సామర్థ్యాలపైనా చర్చ సాగింది. టెన్త్ పబ్లిక్ పరీక్షలు దగ్గర పడుతున్న క్రమంలో ప్రతి ఉన్నత పాఠశాలలోనూ వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఆయా పాఠశాలల హెచ్ఎంలు తీసుకుంటున్న చర్యలను వివరించారు. తెలుగు, సంస్కృతం, ఇంగ్లీష్, హిందీ సబ్జెక్టుల్లో విద్యార్థులకు వ్యాకరణ పాఠాలు ఎలా నేర్పిస్తున్నారు, ఇతర సబ్జెక్టుల్లో ప్రధానాంశాలు ఎలా బోధిస్తున్నారనే దానిపై ఆరా తీశారు. ఆయా పాఠశాలల్లో నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల నివేదికలను సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి ద్వారా డీఈవో వరలక్ష్మి విద్యాశాఖ కమిషనర్ విజయరామ రాజుకు సమర్పిస్తారు.

ఎ.కొత్తకోటలో చిరుత సంచారం

చౌడేపల్లె, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి):చౌడేపల్లె మండలం ఎ.కొత్తకోటలో చిరుత పులి సంచరించిందని తెలియడంతో గ్రామస్తులు భయభ్రాంతులకు గురవుతున్నారు. శనివారం రాత్రి ఎ.కొత్తకోట సమీపంలో ఉన్న అగస్త్యేశ్వరస్వామి కొండకు వెళ్లే మార్గంలో చిరుత సంచరించడాన్ని కొంతమంది గమనించారు.ఈ విషయం తెలిసి పంట పొలాల్లోకి వెళ్లాలంటే కూడా గ్రామస్తులు భయపడుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చిత్తూరు ఎంపీకి అరుదైన గౌరవం

- ఐదు జాతీయ కమిటీల్లో సభ్యుడిగా దగ్గుమళ్ళ ప్రసాదరావు



చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఐదు జాతీయ కమిటీల్లో సభ్యుడిగా చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావుకు గౌరవం దక్కింది. టీడీపీ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న ప్రసాదరావును కేంద్ర ప్రభుత్వం ఏపీ ప్రభుత్వ అనుమతితో ఐదు జాతీయ కమిటీల్లో సభ్యుడిగా ఎంపిక చేసింది. జాతీయ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ పార్లమెంటరీ కమిటీ , జాతీయ ఫార్మా ఎరువులు , రసాయనాల స్టాండింగ్ కమిటీ , జాతీయ సోషల్ జస్టిస్ అండ్ ఉమెన్ వెల్ఫేర్ మంత్రిత్వశాఖలో కన్సల్టేటివ్ కమిటీ, ఆదాయ పన్ను బిల్లు ఎంపిక కమిటీతోపాటు కేంద్ర రైల్వే కన్సల్టేటివ్ కమిటీలో సభ్యుడిగా ఎంపిక చేశారు.ఏపీ విభజన చట్టం హామీలు, రాష్ట్ర హక్కులు, ప్రయోజనాల కోసం ఏపీ వాణిని పార్లమెంటులో వినిపించి ఫలితాలను రాబడుతున్న ప్రసాదరావు చిత్తూరు పార్లమెంటు పరిధిలోని ఏడు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, అధికారుల సమన్వయంతో ప్రజా సంక్షేమం కోసం కృషిచేస్తున్నారు.

మానవ తప్పిదాలతోనే రోడ్డు ప్రమాదాలు

- రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు సభలో ఎంపీ ప్రసాదరావు



ప్రజలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీ ప్రసాదరావు, ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, మురళీమోహన్, చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, డీటీసీ నిరంజన్ రెడ్డి

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మానవ తప్పిదాలతోనే ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. శనివారం ఎస్వీ సెట్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు సభలో చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, మురళీ మోహన్, చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత తదితరులతో కలిసి ప్రసంగించారు. మూడేళ్లలో జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో సుమారు 350 మంది మరణించారని చెప్పారు. ఇందులోనూ 50 శాతం మంది ద్విచక్రవాహన ప్రమాదాల్లోనే మరణించారని అన్నారు. వీరిలో 90 శాతం మంది యువత ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించడం, హెల్మెట్ లేకుండా అతివేగంగా వాహనాలు నడపడమే దీనికి కారణాలన్నారు. డీటీసీ నిరంజన్ రెడ్డి, ఆర్టీవో సునీల్ కుమార్, ఎంవీఐలు రాజేశ్వర్ రావు, మురళి, నరసింహులు, దీపిక, విద్యార్థులు పాల్గొన్నారు.



డీసీవో కార్యాలయంలో సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీసీవో నాగవర్ధన

గ్రామాల్లో పరిశుభ్రత

ప్రభుత్వ కార్యాలయాల్లో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు

బాధ్యత కార్యదర్శులదే

చిత్తూరు కలెక్టరేట్/నింద్ర, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి):జిల్లావ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు కొనసాగాయి. స్థానిక కలెక్టరేట్‌లోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో కార్యాలయ ఆవరణాలను శుభ్రపరిచి, సిబ్బందితో అధికారులు ప్రతిజ్ఞ చేయించారు.డీసీవో కార్యాలయంలో డీసీవో నాగవర్ధన ప్రతిజ్ఞ చేయించి, ఆవరణాన్ని శుభ్రం చేయించారు. అదేవిధంగా స్కిల్ డెవలప్‌మెంట్, సెరికల్చర్ ఆఫీసు, డీఆర్డీఏ, డీఎంహెచ్‌వో కార్యాలయాల్లోనూ ఈ కార్యక్రమం సాగింది. డీపీవో సుధాకర రావు నింద్ర మండలంలోని శ్రీరామపురం పంచాయతీకి వెళ్లారు. సర్పంచ్ జయమ్మ అధ్యక్షతన సభ నిర్వహించారు.డివిజనల్ పంచాయితీ అధికారిణి పార్వతి, డీపీఆర్సీ షణ్ముగం పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీలో పారిశుధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి కార్యదర్శి క్షేత్రస్థాయిలో పారిశుధ్య లోపాన్ని గుర్తించి మెరుగు పరిచేందుకు అంకితభావంతో పనిచేయాలన్నారు.మండలంలోని అనేక పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగ్గా ఉండడంపై ఈవో పీఆర్డీ లక్ష్మీపతిని అభినందించారు.సాయంత్రం దాకా శ్రీరామపురం పేడదిబ్బలు తొలగించడం, ముళ్లకంపలు తొలగించడం, ఫాగింగ్ చేయడం వంటి కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శివప్రసాద్ వర్మ, ఈవోపీఆర్డీ లక్ష్మీపతి, కార్యదర్శి ధరణి, ఎమ్మార్సీ అరుణాచలం తదితరులు పాల్గొన్నారు.



శ్రీరామపురంలో పరిశుభ్రతా కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్న డీపీవో సుధాకర రావు

విధుల్లో నిర్లక్ష్యానికి జీతంలో కోత

- విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదులతో ఏపీఈఆర్సీ విచారణ
- వందమంది ఏఈల జీతం నుంచి రూ.55.31 లక్షల రికవరీకి ఆదేశాలు

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సేవల్లో జాప్యం, నిర్లక్ష్యానికి ఉమ్మడి జిల్లాలోని సుమారు 100 మంది ఏఈల జీతాలనుంచి పరిహారం కింద సుమారు రూ.55.31 లక్షలు రికవరీ చేయాలని ఏపీఈఆర్సీ శనివారం ఉత్తర్వులు జారీచేసింది. గత ఏడాది అక్టోబరు నుంచి డిసెంబరు వరకు వినియోగదారులకు అందించాల్సి సేవల్లో జాప్యం, నిర్లక్ష్యం వహించారని ఏపీఈఆర్సీకి 2,547 ఫిర్యాదులు అందాయి. సమగ్ర విచారణ చేసిన ఏపీఈఆర్సీ.. నిజమేనని తేలడంతో వంద మంది ఏఈల జీతాల నుంచి పరిహారం కింద రూ.55.31 లక్షలు రికవరీ చేసి.. వినియోగదారుల ఖాతాలకు చెల్లించనుంది. ఈ ఫిర్యాదుల్లో అత్యధికంగా తిరుపతి అర్బన్ డివిజన్ పరిధి నుంచి 1,416 మంది వినియోగదారులు అంటే 40 శాతం కంటే ఎక్కువమంది ఉండటం విశేషం. ఇప్పటికే దీనిపై జిల్లా అధికారులకు ఆదేశాలు అందాయి.

డివిజన్ల వారీగా ఫిర్యాదులు, పరిహారం

డివిజన్	ఫిర్యాదులు	పరిహారం (రూ.లక్షల్లో)
చిత్తూరు రూరల్	85	2.17
చిత్తూరు అర్బన్	169	4.24
మదనపల్లె	135	1.72
పీలేరు	70	3.12
పుంగనూరు	117	3.81
పుత్తూరు	105	4.32
తిరుపతి రూరల్	154	2.69
తిరుపతి అర్బన్	1416	33.20
మొత్తం	2547	55.31

తిరుపతికి రేపు ఇద్దరు సీఎంల రాక

- ఐటీసీఎక్స్-2025లో పాల్గొననున్న దేవేంద్ర ఫడ్నవీస్, ప్రమోద్‌సావంత్

తిరుపతి(కలెక్టరేట్)/తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరానికి సోమవారం మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, గోవా సీఎం ప్రమోద్ సావంత్ రానున్నారు. మంగళంరోడ్డులోని ఆశా కన్వెన్షన్ సెంటర్‌లో సోమవారం జరిగే అంతర్జాతీయ దేవాలయాల సమ్మేళనం(ఐటీసీఎక్స్)-2025లో వీరు పాల్గొననున్నారు. గోవా సీఎం ప్రమోద సావంత్ ఆదివారం రాత్రి తిరుపతికి చేరుకుంటారు. సోమవారం ఉదయం 6గంటలకు తిరుమల శ్రీవారిని దర్శించుకుంటారు. అనంతరం తిరుపతికి చేరుకుని అంతర్జాతీయ దేవాలయాల సమ్మేళనంలో పాల్గొంటారు. తిరిగి రాత్రి 9గంటలకు హైదరాబాద్‌కు బయలుదేరి వెళుతారు. ఇక మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్రఫడ్నవీస్ సోమవారం మధ్యాహ్నం 12.45 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుంటారు. తిరుమలకు వెళ్లి స్వామివారిని దర్శించుకుంటారు. మధ్యాహ్నం 3.10గంటలకు అంతర్జాతీయ దేవాలయాల సమ్మేళనంలో పాల్గొని, సాయంత్రం 5.45 గంటలకు తిరుగు ప్రయాణమవుతారు. కాగా, ఈ ఇంటర్నేషనల్ టెంపుల్స్ కన్వెన్షన్ అండ్ ఎక్స్‌పో సోమవారం నుంచి మూడు రోజుల పాటు జరగనుందని ఆ సంస్థ వ్యవస్థాపకుడు గిరేష్‌కులకర్ణి ఓ ప్రకటనలో తెలిపారు. నిపుణుల నేతృత్వంలో దేవాలయాలపై చర్చలు, ప్రదర్శనలు, వర్క్‌షాపులు, మాస్టర్‌క్లాస్‌లు ఇవ్వనున్నారు. 58 దేశాలలోని 1,581దేవాలయాలను ఒకే వేదికపై అనుసంధానించడంచ సస్టైనబిలిటీ అండ్ రెన్యూవబుల్ ఎనర్జీ, టెంపుల్ గవర్నెన్స్ అండ్ కంప్లయన్స్ టెంపుల్ ఎకానమీ, స్మార్ట్ టెంపుల్ సొల్యూషన్స్ వంటి అంశాలపై చర్చాగోష్ఠి జరగనుంది.

మద్యానికి డబ్బివ్వలేదని భార్యను చంపేశాడు



భర్త చేతిలో హత్యకు గురైన మంగమ్మ

శాంతిపురం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగడానికి భార్య డబ్బులు ఇవ్వలేదని హతమార్చిన సంఘటన శాంతిపురం మండలం కర్లగట్ట పంచాయతీ మాదనపల్లెలో చోటుచేసుకొంది. రాళ్లబుదుగూరు ఎస్ఐ నరేష్ కథనం మేరకు...మాదనపల్లెకు చెందిన దంపతులు మునస్వామి(45) మంగమ్మ(36)లకు ముగ్గురు పిల్లలు ప్రకాష్, రమ్య, కావ్య ఉన్నారు. ప్రకాష్ ఇడుపులపాయలో ట్రిపుల్ ఐటీ చదువుతుండగా రమ్య, కావ్య కడపల్లె కస్తూరిబా గురుకుల పాఠశాలలో చదువుతున్నారు. మంగమ్మ కూడా అదే పాఠశాలలో వంట మనిషిగా పనిచేస్తోంది. మద్యానికి బానిసగా మారిన మునస్వామి భార్యతో తరచూ గొడవ పడేవాడు. ఈ క్రమంలో శుక్రవారం మద్యం కొనుక్కోవడానికి డబ్బివ్వాలంటూ మంగమ్మతో తీవ్రంగా గొడవ పడ్డాడు.ఆ కోపంతో అదే రోజు రాత్రి నిద్రిస్తున్న మంగమ్మను రాడ్‌తో తీవ్రంగా కొట్టగా ఆమె అక్కడికక్కడే మృతి చెందింది.. శనివారం ఉదయం భార్య మృతి చెందిందని తెలుసుకొన్న మునస్వామి రాళ్లబుదుగూరు పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. ఎస్ఐ నరేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.అమ్మ మృతి చెంది తండ్రి జైలుపాలు కావడంతో ముగ్గురు పిల్లలు అనాథలయ్యారు.

8న జాతీయ లోక్‌అదాలత్



జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి భారతి

చిత్తూరు లీగల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్ మార్చి 8వ తేదీన జరగనుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎం.ఎస్. భారతి తెలిపారు. శనివారం ఆమె మీడియాతో మాట్లాడారు.క్రిమినల్, సివిల్, మోటర్ వాహనాలు, చెక్‌బౌన్స్, డీవీసీ, బ్యాంకు, పలురకాల కేసులను కక్షిదారులు లోక్ అదాలత్ ద్వారా రాజీచేసుకునే అవకాశం ఉందని చెప్పారు.న్యాయవాదులు, పోలీసులు తమవంతు సహకారాలు అందించాలని కోరారు.

ఫటా ఫట్

చిత్తూరు రూరల్, ఆంధ్రజ్యోతి

వేసవికాలంలో తలెత్తే నీటిఎద్దడిని ఎదుర్కోవడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు చెప్పారు. ఏ మండలంలోనూ నీటి ఎద్దడి రాకుండా చూస్తామన్నారు.

నీటి ఎద్దడి తలెత్తనివ్వం

- జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు



? నీటి ఎద్దడి సమస్యను ఎదుర్కోవడంపై

! క్రాష్ ప్రోగ్రామ్ ద్వారా హ్యాండ్ బోర్లన్నీ కూడా చెక్ చేయిస్తున్నాం.పాడైన వాటిని రిపేరు చేయిస్తున్నాం. ఈసారి వర్షాలు కూడా విస్తారంగా కురిశాయి. కొన్ని మండలాలు మినహా మిగిలినచోట నీటి సమస్య వచ్చే అవకాశం లేదు.ఉమ్మడి చిత్తూరు జిల్లాలో కుప్పం, పలమనేరు, తంబళ్లపల్లె, మదనపల్లె నియోజకవర్గాల్లో వర్షాలు సరిగా కురవకపోవడం వల్ల నీటి ఎద్దడి వచ్చే అవకాశం ఉంది.దీనికోసం ఆయా మండలాలకు వచ్చే 15వ ఫైనాన్స్ నిధులను పూర్తిగా నీటి కోసం వినియోగించాలని ఆదేశాలిచ్చాం. రోడ్డు, కాలువలు ఇతర సివిల్ వర్కులు ఉపాధి హామీ నిధుల ద్వారా చేసుకోచ్చునని సూచించాం. అలాగే నీటి ఎద్దడి తలెత్తే మండలాల్లో ట్యాంకర్ల ద్వారా, వ్యవసాయ మోటర్ల ద్వారా నీటిని అందించే ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రతి నీటి ట్యాంకును శుభ్రం చేయిస్తున్నాం. ఎక్కడ.. ఎలా చేశారు అనే విషయాలను కూడా సిబ్బందితో జీపీఎస్ ద్వారా ఫొటోలు అప్‌లోడ్ చేయిస్తున్నాం.

? చేసిన పనులకైన ఖర్చు

! సుమారు 681పనులకు గాను రూ.22.91 కోట్లు ఖర్చు చేశాం. ఇందులో 273 సీసీరోడ్లు, కాలువలు, ట్యాంకులు.. సివిల్ వర్క్స్ కాగా, మిగిలినవన్నీ వాటర్ వర్కులు చేయడం జరిగింది. వీటిలో 99 శాతం పనులను పూర్తి చేశాం. పనులకు సంబంధించిన బిల్లులు కూడా దాదాపుగా చెల్లించాం.

? 2018-19లో చేసిన పనులకు బిల్లులు

! సుమారు 238 పనులకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని తేలింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇప్పటి వరకు ఈ పనులకు సుమారు రూ.3కోట్ల దాకా బిల్లులు విడుదల చేయడం జరిగింది. ఇంకా బిల్లులు రావాలని ఎం.బుక్‌లు తెస్తున్నారు.. వచ్చింది వచ్చినట్టుగా చేస్తున్నాం.

? జడ్పీ పరిధిలోని ఉద్యోగుల పీఎఫ్ ఖాతా వివరాల అప్‌డేషన్

! జడ్పీ పరిధిలోని ఉద్యోగుల పీఎఫ్ ఖాతాను గతంలో రాష్ట్రస్థాయిలో నిర్వహించేవారు. దీంతో ఉద్యోగులు తమ ఖాతాలో ఎంతమొత్తం ఉందో కూడా చూసుకునేందుకు సైట్ పనిచేసేది కాదు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం జడ్పీ పరిధిలోని ఉద్యోగుల పీఎఫ్ ఖాతా కోసం సాఫ్ట్‌వేర్‌ను డెవలప్ చేసింది. దీంతో మళ్లీ ఉద్యోగులు తమ వివరాలను ఆన్‌లైన్‌లో తెలుసుకునే వీలు కలిగింది. ఇప్పటి వరకు 2021-2022 వరకు ఖాతా వివరాలను అప్‌డేట్ చేశాం. మరో నెల రోజుల్లో వివరాలన్నీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచే ఏర్పాట్లు చేస్తున్నాం.

శేషాచల కొండకోనల్లో, సముద్రం,

శ్రీగంధం పుస్తకాలా విష్కరణ



శ్రీసిటీ, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): శ్రీసిటీ బిజినెస్ సెంటర్‌లో శనివారం శ్రీసిటీ ఆధ్యాత్మిక సాహిత్య వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో మూడు పుస్తకాలను ఆవిష్కరించారు. పర్వతారోహకుడు, రచయిత భూమన్ రచించిన శేషాచల కొండకోనల్లో పుస్తకాన్ని శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి.. డాక్టర్ కనుపూరు శ్రీనివాసులురెడ్డి రచించిన సముద్రం, శ్రీగంధం కథా సంపుటాలను రవీంద్ర సన్నారెడ్డి, సన్నారెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆవిష్కరించారు. రచయిత భూమన్ తన స్వీయ అనుభవంతో శేషాచల కొండల అందం, ఆధ్యాత్మిక సారాన్ని వివరిస్తూ 'శేషాచల కొండల్లో' పుస్తకాన్ని తీర్చిదిద్దారు. రైతులు, స్త్రీలు, మానవ సంబంధిత అంశాలను స్పృశిస్తూ చిన్న చిన్న కథా సంపుటాలను రచయిత శ్రీనివాసులురెడ్డి సముద్రం, శ్రీగంధం పుస్తకాలలో పొందుపరిచారు. శ్రీసిటీలో విజ్ఞానం, సాంస్కృతిక వృద్ధిని పెంపొందించాలనే రవీంద్ర సన్నారెడ్డి దృష్టికిసరితూగే రీతిలో ప్రకృతి, మానవ సంబంధాలను స్పృశించే అంశాలతో తన పుస్తక సారాంశం ముడిపడి ఉందని భూమన్ వివరించారు. కథ అంటే కేవలం పదాల సమాహారమే కాదు జీవిత ప్రతిరూపమని మరో రచయిత కనుపూరు శ్రీనివాసులురెడ్డి వ్యాఖ్యానించారు. రచనల సాహిత్య ప్రాముఖ్యత, కథన శైలి, ఇతివృత్త సంపన్నతపై ప్రముఖ రచయితలు, సమీక్షకులు ఆర్‌ఎం ఉమామహేశ్వరరావు, పేటశ్రీ, జింకా నాగరాజు, డాక్టర్ పెళ్ళకూరు జయప్రద, డాక్టర్ పెరుగు రామకృష్ణ తమ అవగాహన దృక్పథాన్ని పంచుకున్నారు. సమకాలీన తెలుగు సాహిత్యంపై పుస్తకాల ప్రభావం, రచయితల విలక్షణమైన కథా కథన శైలి, కథనాలలోని భావోద్వేగం, తాత్విక సమ్మేళనం, నేటి సమాజంలో ఇతివృత్తాల ప్రాముఖ్యతను వివరించారు. శ్రీకృష్ణదేవరాయ వర్సిటీ మాజీ వీసీ పి.కుసుమకుమారి ప్రసంగించారు.

శ్రీవారి సర్వదర్శనానికి 16 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్ 2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.


గురువారం నాటి హుండీ ఆదాయం: రూ.3.70 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 64,527

తలనీలాలు సమర్పించినవారు: 23,129

విద్యార్థి జీవితానికి పదవ తరగతి కీలక మలుపు. ఉన్నత విద్యకు... ఆపై బంగారు భవిష్యత్తుకు ఇది పునాది. ఈ పునాది బలంగా ఉండాలంటే... ఉజ్వల భవితకు బాటలు వేసుకోవాలంటే పదవ తరగతి పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకోవాలి. ప్రణాళిక ప్రకారం చదువుతూ... కొన్ని మెళకువలను పాటిస్తూ.. సమయ పాలనతో చదివితే ఇదేమంత కష్టం కాదంటున్నారు నిపుణులైన ఉపాధ్యాయులు. మార్చి 17నుంచి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ముందస్తు ప్రిపరేషన్ కోసం వారి విలువైన సూచనలివి. - తిరుపతి(విద్య), ఆంధ్రజ్యోతి

ఇలా ప్రిపేరయితే టెన్షన్ ఉండదు





పదజాలం, వ్యాకరణాంశాలపై సాధన



తెలుగులో అవగాహన- ప్రతిస్పందనకు 32 మార్కులుంటాయి. గద్యభాగం ప్రశ్నలకు సమాధానాలు రాయాలి. ఉపవాచకం నుంచి ఇచ్చే 4 వాక్యాలను ఏ కాండలకు చెందినవో గుర్తించి పూర్తి వాక్యరూపంలో రాయాలి. అపరిచిత గద్యం, లేఖ, సంభాషణ తదితర రూపంలో ఇచ్చిన ప్రశ్నలకు జవాబులు ఇదేలాగా రాయాలి. 2వ విభాగంలో వ్యక్తీకరణ- సృజనాత్మకతకు 36 మార్కులు ఉంటాయి. పద్యభాగం నుంచి కవిపరిచయం, వ్యాసరూప ప్రశ్నలు, గద్యభాగంలో ప్రక్రియ లేదా నేపథ్యం అడుగుతారు. రామాయణంలో ఒక పాత్రస్వభావం వివరించాలి. మూడవ విభాగంలో పద్య, గద్య భాగాల్లోని భాషాంశాలు, పదజాలం, వ్యాకరణాంశాలు, పదవిజ్ఞానం అడుగుతారు.

- యువశ్రీ మురళి, తెలుగు ఉపాధ్యాయుడు, జడ్పీహైస్కూల్, కల్లివెట్టు, బి.ఎన్.కండ్రిగ మండలం.

ఆసక్తి ఉంటే ఆంగ్లంలో అధిక మార్కులు



ఆసక్తి చూపితే ఆంగ్లంలో అధిక మార్కులు సాధించవచ్చు. ఈ ఏడాది ప్రశ్నపత్రం మార్పులను గుర్తించి సాధన చేయాలి. డైరెక్ట్ అండ్ ఇండైరెక్ట్ స్పీచ్, ఎడిటింగ్ ప్యాసేజ్/ఎర్రర్ కరెక్షన్, టు, ఉడ్ ఉపయోగించి రాయడంపై అవగాహన పెంచుకోవాలి. డిస్క్రిప్టివ్ రైటింగ్, స్క్రిప్ట్ ఫర్ స్పీచ్‌లో రచనా నైపుణ్యాన్ని సాధించాలి. వెనుకబడిన విద్యార్థులు మంచి మార్కులు సాధించాలంటే కాంప్రెహెన్షన్, స్టడీ సర్కిల్, జంబుల్డ్ సెంటెన్స్‌ను వరుస క్రమంలో రాయడం, గ్రామర్‌లో రిలేటివ్ క్లాస్, ఇచ్చిన రెండు వాక్యాలను కలపడం, ప్రిపోసిజషన్స్, ఆర్టికల్, గివింగ్ అడ్వైజ్/సజెషన్, వకాబులరీ, డిక్షనరీ స్కిల్స్, క్రియేటివ్ రైటింగ్‌లో డైరీ ఎంట్రీ, లెటర్ రైటింగ్ అంశాలపై కొంత పట్టు అవసరం.

- కె.భాస్కర్, స్కూల్ అసిస్టెంట్(ఆంగ్లం), తొండమనాడు, శ్రీకాళహస్తి మండలం.

అవగాహనతో అత్యధిక మార్కులు



హిందీలో సులభంగా ఎక్కువ మార్కులు సాధించవచ్చు. సెక్షన్-1లో 12 ఐచ్ఛిక వ్యాకరణ సంబంధ ప్రశ్నలు ఇస్తారు. సెక్షన్-2లో 9, 10 పాఠాల నుంచి పఠిత గద్యాంశంలో ఐదు మార్కులకు ఐదు ప్రశ్నలు, 3, 5 పాఠాల నుంచి పఠిత పద్యాంశంపై 5 ప్రశ్నలు ఇస్తారు. అపఠిత గద్య, పద్య పేరాల నుంచి 10 ప్రశ్నలు ఇస్తారు. సెక్షన్-3లో ఓ ప్రాచీన కవి లేదా నవీన కవి పరిచయంపై ఐదు మార్కులుంటాయి. పరిచయ పేరాను చదివి ఖాళీలు పూరిస్తే ఐదు మార్కులు పొందొచ్చు. పాఠాల చివరనున్న ప్రశ్నలకు జవాబులు బాగా చదివి సెక్షన్ 4లో ఇచ్చే 8 ప్రశ్నల్లో 6 ప్రశ్నలకు 5-6 వాక్యాల్లో జవాబులు రాస్తే 24 మార్కులు సాధించవచ్చు.

- ఎస్.మల్లేశ్వరి, స్కూల్ అసిసెంట్, ఎస్పీజడ్పీ బాలికల పాఠశాల, చంద్రగిరి.

మ్యాపు నైపుణ్యాలపై పట్టు



సాంఘిక శాస్త్రంలో మ్యాపు నైపుణ్యాలపై పట్టు అవసరం. ప్రపంచ పటం, భారతదేశ పటాన్ని బాగా గుర్తుంచుకోవాలి. పట్టికలు, గ్రాఫ్‌లు విశ్లేషించమనే అవకాశం ఉంటుంది. వినియోగదారులు అవగాహన పెంచుకోడానికి నినాదాలు, ప్రజాస్వామ్యం విజయవంతమయ్యేందుకు సూచనలు వంటి ప్రశ్నలు ఉంటాయి. సమకాలీన అంశాలపై ప్రతిస్పందనలు, ప్రశ్నించడం, విద్యాప్రమాణాలు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, నిరక్షరాస్యత, ఆదాయ అసమానతలు అంశాలపై ప్రశ్నలు వస్తాయి.

- కె.సురేష్, సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు, జడ్పీహైస్కూల్, ఊరందూరు, శ్రీకాళహస్తి మండలం

ఎక్కువ మార్కులు స్కోర్ చేయొచ్చు



జీవశాస్త్రం మొదటి అధ్యాయంలో లైఫ్ ప్రాసెస్ (జీవక్రియలు), జీవుల్లో ప్రత్యుత్పత్తి, అనువంశికత అనే యూనిట్‌ను బాగా చదువుకోవాలి. వ్యాసరూప ప్రశ్నలు ఎక్కువగా వస్తాయి. మానవ విసర్జక వ్యవస్థ, పుష్ప నిర్మాణం, స్త్రీ ప్రత్యుత్పత్తి వ్యవస్థ, మానవునిలో లింగనిర్ధయం, నెఫ్రాన్, న్యూరాన్, మెదడు నిర్మాణం చిత్రాలను బాగా సాధన చేయాలి. కిరణజన్య సంయోగ క్రియకు కార్బన్ డైఆక్సైడ్ అవసరం, పిండి పదార్థంపై లాలాజలచర్య, రైజోఫస్ ప్రయోగాలను గురించి వివరంగా నేర్చుకోవాలి. పట్టికలు, పేరాగ్రాఫ్ ఆధారిత ప్రశ్నలను సాధన చేయాలి.

- పి.నీలకంఠయ్య, జీవశాస్త్ర ఉపాధ్యాయుడు, జడ్పీ హైస్కూల్, కరకంబాడి

సాధనతో సాధ్యం

మాథ్స్‌లో సెక్షన్-1లో 12, సెక్షన్-2లో 16, సెక్షన్-3లో 32, సెక్షన్-4లో 40 మార్కులకు పేపర్ ఉంటుంది. సంభావ్యత చాప్టర్‌లోని అన్ని సమస్యలపై ప్రాక్టీస్ చేయాలి. గ్రాఫ్‌లను పరిశీలించి సమాధానాలు రాయాలి. సాంఖ్యక శాస్త్రంలో వర్గీకృత దత్తాంశానికి సగటు, మధ్యగతం, బాహుళకాన్ని గుర్తించాలి. రెండు చర రాసుల్లో రేఖీయ సమీకరణాల జతలో గ్రాఫ్ ద్వారా సాధన, చతురస్ర శీర్షాలను చూపండి వంటి 8 మార్కుల ప్రశ్నలపై సాధన చేయాలి. వర్గసమీకరణాలు, అంకశ్రేఢులు, త్రికోణమితి పరిచయం, వృత్తాలు, ఉపరితల వైశాల్యాలు, ఘన పరిమాణాలు చాప్టర్లలో పట్టు అవసరం. వర్గీకృత దత్తాంశానికి సగటు, మధ్యగతము, బాహుళకాన్ని గుర్తించి సూత్రాన్ని రాసి పదాలను వివరించాలి.



- ఎం.పూర్ణచంద్రారెడ్డి, జడ్పీ హైస్కూల్, తడకు ఆర్ఎస్.

బ్లూప్రింట్, మాదిరి ప్రశ్నపత్రాలు కీలకం

జనరల్ సైన్స్ ప్రశ్నపత్రం నాలుగు సెక్షన్లుగా ఉంటుంది. సెక్షన్-1లో 1 మార్కు ప్రశ్నలు 8, 2వ సెక్షన్లో 2 మార్కుల ప్రశ్నలు 3, 3వ సెక్షన్లో 4 మార్కుల ప్రశ్నలు 3, 4వ సెక్షన్లో 8 మార్కుల ప్రశ్నలు మూడింటికి సమాధానాలు రాయాలి. రసాయన చర్యలు - రకాలు, వాటి ఉదాహరణలు, సమీకరణలు, తుల్యం చేయడం, లవణాలు-ఫార్ములాలు, లవణాలు- పయోగాలు, ఆమ్లాల ధర్మాలు- కృత్యాలు, పట సహాయంతో కృత్యాల వివరణ, లోహాలు-ధర్మాలు, లోహాల చర్యాశీలత ఆధారిత కృత్యాలు, హైడ్రోకార్బన్‌లు-రకాలు, ఫార్ములాలు, ధర్మాలు, సంకలన చర్యలు, ప్రతిక్షేపణ చర్యలు, దర్పణాలు-కటకాల భేదాలు, కిరణ చిత్రాలు గీయడం, దర్పణ సూత్రం ఆధారిత సమస్యలు హ్రస్వదృష్టి, దీర్ఘదృష్టి సమస్యలు వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధతో సాధనచేయాలి.



- పి.శైలేందర్‌రెడ్డి, ఫిజికల్‌సైన్స్ ఉపాధ్యాయుడు, జడ్పీహైస్కూల్, కుప్పం బాదూరు

అన్యమతస్థుల పేరుతో క్రైస్తవులను 'కొండ' దించడం రాజ్యాంగ విరుద్ధం



టీటీడీ పరిపాలనా భవనం ముందు నిరసన తెలుపుతున్న చింతా మోహన్

- కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): అన్యమతస్థుల పేరుతో కొండపై ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న క్రైస్తవులను కిందకు దించేందుకు టీటీడీ, ప్రభుత్వం ప్రయత్నించడం రాజ్యాంగ విరుద్ధమమని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ అన్నారు. పేరుతో కొండపై పనిచేసే 4,500 మంది కార్మికులను దించే ప్రయత్నం చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ విషయమై తిరుపతిలోని టీటీడీ పరిపాలనా వద్ద శనివారం ఆయన కాంగ్రెస్ నేతలతో కలిసి నిరసన చేపట్టారు. బ్రిటీష్ పాలనలో తిరుచానూరులో ఓ దళితుడు ఆలయ ప్రవేశం చేశాడని జైల్లో పెట్టారని తెలుసుకున్న మహాత్మాగాంధీ, రాజగోపాలాచారి తిరుమలకు చేరుకొని పోరాటం చేసి 33 మంది దళితులకు ఆలయ ప్రవేశం కల్పించిన విషయాన్ని గ్రహించాలన్నారు. కుల, మత వివక్ష లేకుండా ప్రతి ఒక్కరికీ ముఖ్యంగా దళితులకు ఆలయ ప్రవేశం కల్పించడమే సనాతన ధర్మం అనే విషయాన్ని తెలుసుకోవాలన్నారు. టీటీడీ ఉద్యోగులకు, అర్చకులకు అడవుల్లో ఇచ్చిన ఇళ్ల స్థలాలను రద్దు చేసి.. అలిపిరి నుంచి పేరూరు వరకు ఖాళీగా ఉన్న 400 ఎకరాల టీటీడీ భూముల్లో 5 సెంట్ల చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో కాంగ్రెస్ నేతలు యార్లపల్లి గోపీ గౌడ్, రవి, తేజోవతి, రావణ్, మునిశోభ, వెంకటేష్‌గౌడ్, భాగ్యరాజ్ తదితరులు పాల్గొన్నారు.

తుడా బీపీఎస్, ఎల్ఆర్ఎస్‌కు విశేష స్పందన

తిరుపతి, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా)ఆధ్వర్యంలో నిర్వహించిన బీపీఎస్, ఎల్ఆర్ఎస్‌కు మేళాకు విశేష స్పందన లభించిందని తుడా వీసీ ఎస్.మౌర్య తెలిపారు. శనివారం సాయంత్రం ఆమె అధికారులతో సమావేశమై సమీక్షించారు. 2020లో తుడా నిర్వహించిన మేళాలో ఎల్ఆర్ఎస్‌కి సంబంధించి 3363 దరఖాస్తులు పెండింగ్ ఉండగా 2394 దరఖాస్తులు క్లియర్ చేశామన్నారు. 423 దరఖాస్తులకు సరైన పత్రాలు, డ్రాయింగ్ ఇవ్వనందువల్ల షార్ట్‌ఫాల్ పెట్టామన్నారు. 2019లో బీపీఎస్ కింద 51 దరఖాస్తులు ఉండగా పదింటికి అనుమతులు ఇచ్చామన్నారు. పత్రాలు, డ్రాయింగ్ సక్రమంగా లేని 29 దరఖాస్తులు షార్ట్ ఫాల్ పెట్టామని వివరించారు. వీటిని పరిష్కరించేందుకు ఇంటింటికి వెళ్ళి ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అంతవరకు దరఖాస్తుదారులు వేచిచూడకుండా, తుడా కార్యాలయానికి వచ్చి మార్చి నెలాఖరులోపు పరిష్కరించు కోవచ్చని సూచించారు. ఈ మూడు రోజులపాటు నిర్వహించిన మేళాలో సుమారు వందమంది నేరుగా వచ్చి దరఖాస్తులు పరిష్కరించుకొన్నారన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు ఆర్టీసీ సన్నద్ధం



అధికారులతో సమీక్షిస్తున్న డీపీటీవో నరసింహులు

తిరుపతి(ఆర్టీసీ), ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): శివరాత్రి ఉత్సవాలకు ఆర్టీసీ యాజమాన్యం సన్నద్ధమవుతోంది. డీపీటీవో జి.నరసింహులు శనివారం డిపో మేనేజర్లతో సమీక్షించారు. శైవక్షేత్రాలకు కొరత లేకుండా సర్వీసులు నడపాలని ఆదేశించారు. పల్నాడు జిల్లాలోని కోటప్పకొండకు వంద బస్సులు తరలించాలని ఆదేశించారు. ఈ నెల 25, 26, 27 తేదీలలో తిరుపతి, కోడూరు-తలకోన, గుడిమల్లం, శ్రీకాళహస్తి-తిరుపతి, నాయుడుపేట, గూడూరు, పిచ్చాటూరు, తడ, చెన్నై, గుడిమల్లం, పుత్తూరు-సదాశివకోన, కైలాసకోన, మూలకోన, ఊత్తుకోట-సదాశివకోన, వరదయ్యపాళెం-అవంతి, కోట, నాయుడుపేట-పంబ్రంగం మార్గాలతో ప్రత్యేక సర్వీసులు నడపాలని సూచించారు. కాగా, సెంట్రల్ బస్టాండులో ప్రజారవాణాధికారి జి.నరసింహులు ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. పరిసరాలను శుభ్రపరిచారు.

ముగిసిన నైపుణ్యాభివృద్ధి శిక్షణ



రైతులతో డీఈ శోభామణి, సీసీవీఈసీ కోఆర్డినేటర్ సుజాత తదితరులు

తిరుపతిరూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో నిరంతర పశువైద్య విద్య, సమాచార కేంద్రం ఆధ్వర్యంలో శాస్త్రీయ పద్ధతుల్లో సీమపందుల పెంపకం అనే అంశంపై యువత, రైతులకు ఐదు రోజుల పాటు నిర్వహించిన నైపుణ్యాభివృద్ధి శిక్షణ శనివారంతో ముగిసింది. యాజమాన్య పద్ధతులపై మెలకువలు, పోషణ, వ్యాధుల నివారణ, చికిత్స, వ్యాక్సినేషన్, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, ఫిగ్ మాన్యూర్ మేనేజ్‌మెంట్ వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. కోళ్ల మరణాలకు కారణమైన బర్డ్‌ఫ్లూ వ్యాధిపై అవగాహన కల్పించారు. అతిథిగా హాజరైన వర్సిటీ డీఈ ప్రొఫెసర్ డాక్టర్ శోభామణి మాట్లాడుతూ శిక్షణ ద్వారా పొందిన పరిజ్ఞానంతో సీమపందుల పెంపకాన్ని చేపట్టి ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు. ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ డాక్టర్ సుజాతతో కలసి రైతులకు సర్టిఫికెట్లు అందజేశారు. శాస్త్రవేత్తలు డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, డాక్టర్ జి.విజయభాస్కర్‌రెడ్డి, అసిస్టెంట్ ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.మంజరి పాల్గొన్నారు.

భార్య కాపురానికి రాలేదని ఆత్మహత్య

ఎర్రావారిపాలెం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): భార్య కాపురానికి రాలేదని భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ డీవై స్వామి కథనం మేరకు అన్నమయ్య జిల్లా సుండుపల్లె మండలం చెరుకువారిపల్లెకు చెందిన వెంకట నాగసుబ్బయ్య (31) ఐదేళ్ల క్రితం ఎర్రావారిపాలెం మండలం ఎల్లమంద జలిజపల్లెకు చెందిన ఝాన్సీని వివాహం చేసుకున్నాడు. తర్వాత కొన్నాళ్ల జీవనోపాధి కోసం కువైత్ వెళ్లొచ్చాడు. ఇదే సమయంలో ఉద్యోగ ప్రయత్నాల్లో బెంగళూరులో ఉన్న ఝాన్సీని, స్వగ్రామం రావాలని ఇటీవల పిలిచాడు. ఆమె విముఖత చూపడంతో ఈనెల 10న ఎర్రావారిపాలెంలోని వెటకర్నరీ ఆస్పత్రి వద్ద పురుగుల మందు తాగాడు. స్థానికులు రుయాకు తరలించగా.. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి సోదరుడు ధనంజయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మొబైల్‌లో అనవసరాల జోలికి వెళ్లొద్దు

- సైబర్ నేరాల అవగాహన కార్యక్రమంలో నిపుణుల సూచన



కార్యక్రమంలో పాల్గొన్న సైబర్ నిపుణులు, అధికారులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ల వాడకంలో అనవసర విషయాల జోలికి వెళ్లకపోవడం మేలని నిపుణులు సూచించారు. ఈ విషయంలో యువత కొన్ని ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మొబైల్స్‌లోని వ్యక్తిగత సమాచారం మరొకరికి చేరకుండా జాగ్రత్త వహించాలన్నారు. సైబర్ నేరాలపై సత్యన్న సేన ఆధ్వర్యంలో తిరుపతిలోని పద్మావతి మహిళా యూనివర్సిటీలో ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో శనివారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఇండియన్ సర్వర్స్ ఫౌండర్ సీఈవో సాయిసతీష్ మాట్లాడుతూ.. సైబర్ నేరాలు విపరీతంగా పెరుగుతున్నాయన్నారు. దీనివల్ల ఎందరో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సైబర్ నేరాలకు గురికాకుండా ఉండాలంటే, తొలుత అవగాహన అవసరమన్నారు. సెల్‌ఫోన్లలోని వ్యక్తిగత, కుటుంబ సభ్యుల ఫొటోలు, బ్యాంకు, ఏటీఎం కార్డుల వివరాలు, పిన్ నెంబర్లు వంటి విషయాలను గోప్యంగా ఉంచుకోవాలన్నారు. ఈ అంశాలపై సాధారణ ప్రజలకు విద్యావంతులు అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థుల సందేహాలను నిపుణులు నివృత్తి చేశారు. హ్యాకింగ్ చేసే విధానాన్ని ప్రయోగాత్మకంగా తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో డీన్ కాత్యాయిని, సత్యన్న సేన అధ్యక్షుడు బాలసుబ్రమణ్యం, సభ్యులు, పోలీసు సైబర్ క్రైం విభాగ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నీ ఒకచోటే..!

- సిద్ధమవుతున్న తిరుపతి జిల్లా పోలీసు కార్యాలయ సముదాయం

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖకు సంబంధించి అన్ని విభాగాలూ ఒకేచోట ఉండేలా.. తిరుపతిలోని పోలీసు పెరేడ్ మైదానంలో జిల్లా పోలీసు కార్యాలయ సముదాయం సిద్ధమవుతోంది. దాదాపు రూ.6.41 కోట్లతో జరుగుతున్న ఈ పనులను వీలైనంత త్వరలో పూర్తి చేసి సీఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ప్రారంభించడానికి అధికారులు చర్యలు చచేపట్టారు. ఈ పనులను ఎస్పీ హర్షవర్ధనరాజు శనివారం పరిశీలించారు. ఎక్కడెక్కడ ఎలాంటి నిర్మాణాలు అవసరం? పనులు నాణ్యతగా జరుగుతున్నాయా లేదా? పెయింటింగ్ బాగుందా లేదా అని స్వయంగా పరిశీలించి కొన్ని సూచనలు చేశారు. ఇటీవల సీఎం చంద్రబాబు ప్రత్యేక చొరవతో విడుదల చేసిన రూ.85 లక్షలతో ఫర్నిచర్, ఇతర మౌలిక వసతులు కల్పించడానికి వినియోగించనున్నారు. సందర్శకుల కోసం ప్రత్యేకంగా ఒక హాలు ఏర్పాటు చేస్తున్నారు. పీజీఆర్ఎస్‌కు హాలు ఏర్పాటు చేసి అక్కడ అత్యాధునిక ఫర్నిచర్ సదుపాయం కల్పించనున్నారు. ఈ పనులన్నీ రానున్న నెల రోజుల్లో పూర్తి చేసి ఏప్రిల్ మొదటి వారంలో సీఎం చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయడానికి పోలీసు యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది.

గ్రౌండు ఫ్లోర్: ఎస్పీ కార్యాలయం, సీసీ రూము, స్పెషల్ బ్రాంచ్, కాన్ఫరెన్సు హాలు, పీజీఆర్ఎస్ హాలు, ఫిర్యాదుదారులు వేచి ఉండే గది ఉంటుంది.

మొదటి అంతస్తు: అదనపు ఎస్పీలు (శాంతి భద్రతలు, పరిపాలన) చాంబర్లు, దానికి ఆనుకునే సీసీ గదులు ఉంటాయి. వీటితో పాటు ఏవో చాంబర్, పరిపాలనా సౌలభ్యం కోసం అన్ని విభాగాలు ఇక్కడే ఉంటాయి. అంటే ఏ సెక్షన్ నుంచి దాదాపు 12 సెక్షన్లు ఒకే చోట ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.

రెండో అంతస్తు: కంప్యూటర్ రూములు, క్రైం అదనపు ఎస్పీ చాంబర్,సీసీ రూము,వీడియో కాన్ఫరెన్సు హాలు, సిబ్బందికి అవసరమైన శిక్షణ ఇవ్వడానికి ప్రత్యేకించి ఏసీ చాంబర్,స్టోర్ రూము, డీసీఆర్‌బీ, డీటీఆర్‌బీ, కోర్టు మానిటరింగ్ సిస్టమ్‌కు సంబంధించిన గది ఉంటుంది.



అత్యాధునిక హంగులతో నిర్మాణం అవుతున్న జిల్లా పోలీసు కార్యాలయ కాంప్లెక్సు పనులు

డీఐ పైపుల పరిశ్రమలో స్థానికులకు ఉద్యోగావకాశాలు

● పరిశ్రమ ఈడీ సురేశ్ కండల్



మీడియాతో మాట్లాడుతున్న సురేశ్ కండల్

పుంగనూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా 150 దేశాలకు ఎగుమతి అవుతున్న డీఐ పైపుల తయారీ పరిశ్రమలో స్థానికులకే ఉద్యోగ అవకాశాలు ఉంటాయని ఎలక్ట్రో స్టీల్ క్యాస్టింగ్ లిమిటెడ్ ఈడీ సురేశ్ కండల్ పేర్కొన్నారు. శనివారం పుంగనూరు మండలం ఆరడిగుంట వద్ద ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఫెర్రో అల్లాయ్స్ పరిశ్రమలు దేశ వ్యాప్తంగా ఐదు చోట్ల నడుస్తున్నాయన్నారు. ఆరడిగుంట వద్ద కొంత కాలం క్రితం పరిశ్రమ పనులు ప్రారంభించి 240 మంది ఉద్యోగులతో పనులు జరుగుతున్నాయని, స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. శ్రీకాళహస్తిలో 400 మందితో ప్లాంటు ప్రారంభించగా ప్రస్తుతం 6 వేల మంది ఉద్యోగులు తెలిపారు. పుంగనూరు డీఐపైపుల పరిశ్రమకు ఇప్పటికే మూడుసార్లు ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు చేపట్టామన్నారు. ఉద్యోగులకు పీఎఫ్, బోనస్, మెడికల్ క్లైమ్ తదితర సౌకర్యాలు ఉంటాయని వివరించారు. ఆయనతోపాటు ఎలక్ట్రో స్టీల్ క్యాస్టింగ్ లిమిటెడ్ జీఎం దొరైరాజు, ప్లాంట్ ఇన్‌చార్జి సైనాపతి, సెక్యూరిటీ ఆఫీసర్ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వీఆర్వో అసోసియేషన్ జిల్లా కార్యవర్గం


రాజశేఖర్ - శరత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం సర్వసభ్య సమావేశం శనివారం చిత్తూరులో జరిగింది. జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా జి.రాజశేఖర్ (తవణంపల్లె), ప్రధాన కార్యదర్శిగా ఎం.శరత్ కుమార్ (చిత్తూరు రూరల్), కోశాధికారిగా కె.దామోదరం (తవణంపల్లె), ఉపాధ్యక్షుడిగా ఎ.వెంకటముని, జాయింట్ సెక్రటరీలుగా ఉమమహేశ్వరి, శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా తానీషా, సుబ్బయ్య, దేవకుమార్, ఈసీ మెంబర్లుగా అజయ్‌కుమార్ ఎంపికయ్యారు. జిల్లా మాజీ అధ్యక్షుడు బాలాజీరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ హనుమంతరావు, నాయకులు మార్కొండయ్య, కరుణాకర్, చెంగల్రాయలు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికులకు ఆర్పీఎఫ్ ఉద్యోగావకాశం

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా గూడూరు రైల్వేస్టేషన్‌లో రెండేళ్ల వరకు కాంట్రాక్టు పద్ధతిపై ఆర్పీఎఫ్ గార్డుగా పనిచేయడానికి మాజీ సైనికుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సైనిక సంక్షేమాధికారి కేవీ రాఘవులు తెలిపారు. ఎంపికైన వారికి రోజుకు అలవెన్స్ రూ.760, నెలకు పరేడ్ అలవెన్స్ రూ.50, వాషింగ్ అలవెన్స్ రూ.90, ఏడాదికి యూనిఫామ్ అలవెన్స్ రూ.1,500 చెల్లిస్తారన్నారు. రోజూ ఎనిమిది గంటల షిఫ్టు ఉంటుందన్నారు. నెలకు రెండ్రోజులు సెలవులు ఉంటాయన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి ఒకటి నాటికి 45 ఏళ్లకంటే తక్కువ వయసున్నవారు మాత్రమే అర్హులన్నారు. ఆసక్తి కలిగిన వారు తమ పేరు, చిరునామా, కాంటాక్టు ఫోన్ నెంబరు, పుట్టిన తేదీ, సర్వీసులో చేరిన తేదీ, సర్వీస్ నుంచి డిశ్చార్జి అయిన తేదీల వివరాలను 81429 95945 అనే వాట్సాప్ నెంబరుకు పంపాలన్నారు.

పీఎం మోదీ కులంపై తెలంగాణ సీఎం వ్యాఖ్యలు సరికాదు: బీజేపీ

చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ కులంపై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలు సరికాదని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2001లో గుజరాత్ సీఎంగా మోదీ కాకముందే 1999 అక్టోబరు 27న ఆయన కులాన్ని ఓబీసీ జాబితాలోకి చేర్చినట్లు గుర్తుచేశారు. రాహుల్‌గాంధీ మెప్పుకోసం ఇంత అబద్ధాలు, అభూత కల్పనలు చేయడం రేవంత్‌రెడ్డికి అవసరమా అని ప్రశ్నించారు. ప్రధానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

ద్విచక్ర వాహనం దగ్ధం


మంటల్లో కాలుతున్న వాహనం

పెనుమూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై వెళుతున్న ఓ ద్విచక్ర వాహనంలో మంటలు చెలరేగి.. దగ్ధమైంది. పెనుమూరు మండలంలోని కొటార్లపల్లెకి చెందిన యువకుడు గుట్టకిందపల్లె సమీపంలో చెరువు కట్టపై శనివారం సాయంత్రం నేంద్రగుంటకు వెళుతున్నాడు. వైర్లు కాలిన వాసన రావడంతో వాహనాన్ని ఆపాడు. ఉన్నట్టుండి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. భయపడ్డ అతను వాహనాన్ని వదిలి పక్కకు వెళ్లిపోయాడు. దీంతో వాహనం పూర్తిగా దగ్ధమైంది.

గూగుల్ మ్యాప్ చూస్తూ దారితప్పి..

● హంద్రీ-నీవా కాలువలో బోల్తాపడ్డ లారీ
● సురక్షితంగా బయటపడ్డ ముగ్గురు డ్రైవర్లు


బోల్తాపడిన లారీ

తవణంపల్లె, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): గూగుల్ మ్యాప్ చూస్తూ దారి తప్పి.. హంద్రీ-నీవా కాలువలో లారీ ఒకటి బోల్తా పడింది. ఈ సంఘటన తవణంపల్లె మండలంలోని జొన్నగురకల సమీపంలోని రాకాసి కొండ వద్ద శనివారం వేకువ జామున జరిగింది. లారీ డ్రైవర్లు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రం హాసన్ నుంచి అల్లం లోడుతో అసోంకు ఓ లారీ బయల్దేరింది. డ్రైవర్ గూగుల్ మ్యాప్ చూస్తూ.. దారి తప్పి జొన్నగురల-బంగారుపాళ్యం రోడ్డు మీదుగా వస్తున్నాడు. జొన్నగురకల సమీపంలోని హంద్రీ-నీవా కాలువ వద్ద అదుపుతప్పి సుమారు 30 అడుగుల లోతున్న కాలువలోకి లారీ బోల్తాపడింది. ఈ ప్రమాదంలో లారీలోని ముగ్గురు డ్రైవర్లు దర్శన్, మనోజ్, రోహిత్‌సురక్షితంగా బయట పడ్డారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు


నిందితులను చూపుతున్న పోలీసులు

నగరి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): నగరి మండల పరిధిలో గంజాయి తరలిస్తున్న ఇద్దరిని శనివారం సీఐ మహేశ్వర్ అరెస్టు చేశారు. డీఎస్పీ జయ్యాద్ మహ్మద్ అజీజ్ ఆదేశాలతో డిప్యూటీ తహసీల్దార్ ధనంజయులుతో కలిసి ఓజీ కుప్పం గ్రామ మార్గంలో కాపుకాచి గంజాయి తరలిస్తున్న జి.నరసింహులు(56), పుష్పావతి(48)లను అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.25వేల విలువైన 1,200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి.. దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఘనంగా బంజారా శోభాయాత్ర

- సేవాఘడ్‌లో ప్రత్యేక పూజలు



గుర్రంపై సంత్ సేవాలాల్ వేషధారణలో సురేంద్రనాయక్ - హోమం వద్ద బంజారాలతో చల్లా రామచంద్రారెడ్డి

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): బంజారాల ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిన మహానుభావుడు సంత్ సేవాలాల్ అని పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి పేర్కొన్నారు.పుంగనూరు మండలం పూజగానిపల్లె సమీపంలోని సుగాలిమిట్ట సేవాఘడ్‌లో శనివారం నిర్వహించిన భోగబండార్ కార్యక్రమంలో సేవాలాల్ చిత్రపటానికి పూజలు చేశారు.ఈ సందర్భంగా చల్లా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ అనంతపురం జిల్లా గుత్తి సమీపంలోని రామ్‌జీనాయక్ తాండాలో జన్మించిన సంత్ సేవాలాల్ మహారాజ్ పాటలు, రచనల ద్వారా బంజారాలను జాగృతం చేయడంతో పాటు అహింసా సిద్ధాంతాన్ని ప్రబోధించినట్లు తెలిపారు. సేవాలాల్‌ను ఆదర్శంగా తీసుకుని బంజారాలు వారి సంస్కృతిని కాపాడుకుంటూ అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. పుంగనూరు సమీపంలోని ఏడు తాండాల బంజారాలతో పాటు సమీప ప్రాంతాల నుంచి వేలాదిమంది సంత్‌సేవాలాల్ జయంతి వేడుకలకు హాజరయ్యారు. డీజే, బళ్లారి డ్రమ్స్, మంగళవాయిద్యాల నడుమ బంజారాలు నృత్యాలతో కొత్తయిండ్లు నుంచి అంబేడ్కర్ సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, పాత బస్టాండ్, ఇందిరాసర్కిల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. బంజారా మహిళలు వారి సంస్కృతి, సాంప్రదాయాలను అనుసరించి లంబాడీ దుస్తులు ధరించి పాటలు పాడారు.మదనపల్లె నక్కలదిన్నెతాండాకు చెందిన సురేంద్రనాయక్ గుర్రంపై సంత్ సేవాలాల్ వేషధారణలో ర్యాలీలో పాల్గొనడం ఆకర్షించింది.


పుంగనూరులో బంజారాల ర్యాలీ

జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయండి

● చిత్తూరు ఎంపీ


దిశా సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ప్రసాదరావు

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు కోరారు. శనివారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్లో జిల్లా అభివృద్ధి సమన్వయ - పర్యవేక్షణ కమిటీ (దిశా) సమావేశం ఎంపీ అధ్యక్షతన కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలతో లబ్ధి అర్హులకే అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా జిల్లా అభివృద్ధికి కావాల్సిన నిధుల మంజూరుకోసం కలెక్టర్ ద్వారా ప్రతిపాదనలు పంపాలని కోరారు. ప్రభుత్వం నుంచి అందిన నిధులను సకాలంలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంఎస్ఎంఈ ద్వారా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు బ్యాంకు రుణాల మంజూరుకు చర్యలు చేపట్టాలన్నారు. నేషనల్ హెల్త్ మిషన్ కింద కేంద్ర ప్రభుత్వం అందించే నిధులను సకాలంలో విడుదల చేసి మెరుగైన సేవలందించాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ 90 లక్షల పనిదినాలు లక్ష్యంగా ఉపాధి హామీ పనులు ఈ ఏడాది చేపట్టగా, ఇప్పటివరకు 75 లక్షల పనిదినాలు వ్యవసాయ కూలీలకు అందించామన్నారు. మెటీరియల్ కాంపొనెంట్ కింద రూ.150 కోట్లు మంజూరు చేయగా రోడ్ల నిర్మాణాలకు రూ.వందకోట్లు ఖర్చుపెట్టామన్నారు. పుంగనూరు నియోజకవర్గానికి సంబంధించి చెరువుల నిర్మాణం, పైప్‌లైన్ నిర్మాణాలకు చర్యలు చేపడుతున్నామన్నారు. కుప్పంలో కేంద్రీయ విశ్వవిద్యాలయం, సెంటర్ ఫర్ సెరికల్చర్, మ్యాంగో బోర్డు ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వానికి డీపీఆర్ పంపడం జరిగిందన్నారు. ఎంపీ ల్యాడ్స్ కింద రూ.5 కోట్లు మంజూరు కాగా, 60శాతం పనులు మంజూరుచేశామని చెప్పారు.జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, పీఆర్ ఎస్ఈ చంద్రశేఖర రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ విజయకుమార్, డ్వామా పీడీ రవికుమార్, హౌసింగ్ పీడీ గోపాలనాయక్, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి, సీపీవో సాంబశివా రెడ్డి, ఎల్డీఎం హరీష్, డీఎంహెచ్‌వో సుధారాణి, కమిషనర్ నరసింహప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు పరిష్కరించడమే ధ్యేయం

● చిత్తూరు ఎమ్మెల్యే జగన్మోహన్


బాధితుడి నుంచి అర్జీ స్వీకరిస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారించడే ధ్యేయమని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. శనివారం లక్ష్మీనగర్ కాలనీలోని తన కార్యాలయంలో 'ప్రజాదర్బార్' నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. తన నియోజకవర్గ పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి శనివారం అర్జీలు స్వీకరిస్తున్నామని చెప్పారు. కొన్ని సమస్యలను అప్పటికప్పుడే పరిష్కరిస్తున్నామని తెలిపారు. 64 అర్జీలు అందాయని, వీటిని సత్వరం పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మేయర్ అముద, సహాయ కమిషనర్ ప్రసాద్, తహసీల్దార్లు చంద్రశేఖర్, జయంతి, లోకేశ్వరి, ఎంపీడీవోలు శివరాజ్, శ్రీనివాసులు, వెంకటరామి రెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని మినీ వ్యాన్ బోల్తా

- పది మందికి గాయాలు



సంఘటన స్థలంలో మినీ వ్యాను - విరిగిపడ్డ విద్యుత్ స్తంభం

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): అతివేగంగా వెళుతున్న ఓ మినీ వ్యాను అదుపుతప్పి రోడ్డు పక్కనున్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొని బోల్తాపడింది. ఈ ప్రమాదంలో పది మందికి గాయాలయ్యాయి. ఇన్‌చార్జి సీఐ శ్రీనివాసంతి తెలిపిన వివరాల మేరకు.. గంగాధరనెల్లూరు మండలంలోని వేల్కూరు ఇందిరానగర్ కాలనీకి చెందిన మాజీ సర్పంచ్ మునెమ్మ గుండెపోటుతో మృతిచెందారు. శనివారం ఆమె అంత్యక్రియలకు హాజరు కావడానికి ఆత్మకూరు పంచాయతీలోని బంధువులు ఇంద్ర, దేవరాజ్, మేరి, సుమతి, కళా, చిలకమ్మ, రావణి, ఆబేల్, చిలకమ్మ, నళిని, విజయ, సేటు, రంజితం, ఆశీర్వాదం, తంగరాజ్, మత్తయ, సంపూర్ణం, జయమ్మ, కనకమ్మ, ఏసుమణిలు ఓ మినీ వ్యానులో బయల్దేరారు. ఈ వాహనాన్ని రాశిమిరెడ్డిపల్లె దళితవాడకు చెందిన కుట్టి నడుపుతున్నాడు. వేగంగా వెళుతున్న మినీ వ్యాను.. మార్గమధ్యంలో ముక్కళత్తూరు పంచాయతీ (కాసా బిల్డింగ్) ఎం.నాశంపల్లెకు సమీపంలో అదుపుతప్పి రోడ్డుపక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొని బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా, ఏడుగురు స్వల్పంగా గాయపడ్డారు. బాధితులను ప్రైవేటువాహనాలు, అంబులెన్స్‌ల ద్వారా చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆత్మకూరు దళితవాడకు చెందిన వజ్రం కుమారుడు రాజా ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్న ఇన్‌చార్జి సీఐ తెలిపారు.




చికిత్స పొందుతున్న బాధితులు

తప్పిన పెను ప్రమాదం

మినీ వ్యాను ఢీకొన్న వేగానికి విద్యుత్ స్తంభం కూడా విరిగిపోయింది. ఈ స్తంభానికి ఇంకా విద్యుత్ తీగలను ఏర్పాటు చేయకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

దైవ దర్శనానికి వెళ్లొస్తూ

తిరిగిరాని లోకాలకు..!

● ఆగి ఉన్న లారీని కారు ఢీకొనడంతో హైదరాబాదు దంపతుల దుర్మరణం




లారీకిందకు దూసుకెళ్లిన కారు - తిరువణ్ణామలైలో గిరి ప్రదక్షణ చేస్తూ మాధవకృష్ణ, సరితా సుమంగళి తీసుకున్న సెల్ఫీ

పెళ్లకూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు, ఏపీలో పుణ్యక్షేత్రాల సందర్శనకు వచ్చారు. తిరుగు ప్రయాణంలో ఆగి ఉన్న మినీ లారీని వీరి కారు ఢీకొంది. తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలం దొడ్లవారిమిట్ట వద్ద శనివారం మధ్యాహ్నం జరిగిన ఈ ప్రమాదంలో హైదరాబాదుకు చెందిన దంపతులు దుర్మరణం చెందారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. తెలంగాణ రాష్ట్రం వరంగల్ ప్రాంతానికి చెందిన గన్ను మాధవకృష్ణ(48)కు, పోకల సరితా సుమంగళి(43)తో 15 ఏళ్ల క్రితం వివాహమైంది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగరీత్యా విదేశాలకు వెళ్లిన వీరు పదేళ్లపాటు అక్కడే ఉంటూ.. హైదరాబాద్‌లోని ఆంజనేయనగర్ కాలనీ, రోడ్డు నెంబర్5, బోడుప్పల్ ప్రాంతంలో ఇంటిని నిర్మించుకున్నారు. వీరి కుమారుడు నిషాంత్ చదువు కోసం అయిదేళ్ల క్రితం హైదరాబాదుకు వచ్చారు. డెలాయిట్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో మాధవకృష్ణ, టెక్ మహీంద్రలో సరితా సుమంగళిలో పనిచేస్తున్నారు. బుధవారం పౌర్ణమి నేపథ్యంలో తమిళనాడులోని తిరువణ్ణామలైలో గిరి ప్రదక్షణకు వీరిద్దరూ వచ్చారు. శనివారం ఉదయం తిరుమల వేంకటేశ్వరస్వామిని.. అనంతరం శ్రీకాళహస్తిలో వాయులింగేశ్వరుడిని దర్శించుకుని ఇంటికి బయలుదేరారు. మధ్యాహ్నం సమయానికి వీరి కారు.. పెళ్లకూరు మండలం దొడ్లవారిమిట్ట వద్దకు చేరింది. ఆ సమయంలో కారు నడుపుతున్న మాధవకృష్ణ అలసి కునుకు తీశాడో ఏమో కానీ జాతీయ రహదారి రోడ్డు మార్జిన్‌లో నిలిపి ఉన్న మినీ లారీని వీరి కారు ఢీకొంది. లారీ కిందకు దూసుకెళ్లడంతో బెలూన్లు ఓపెన్ అయినా ముందు సీట్లో ఉన్న దంపతులు దుర్మరణం చెందారు. ఎస్ఐ నాగరాజు సంఘటనా స్థలానికి చేరుకుని, స్థానికుల సాయంతో ట్రాక్టర్‌కు తాడు కట్టి అతికష్టం మీద కారును బయటకులాగారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నాయుడుపేట డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, రూరల్ సీఐ సంగమేశ్వరరావు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. అక్కడ లారీ ఆపడానికి కారణం గురించి డ్రైవర్‌ను అడిగారు. రహదారి భద్రతా ప్రమాణాలను పాటిస్తూ పరిమిత వేగంతో ప్రయాణించాలని డీఎస్పీ సూచించారు.

అమ్మమ్మ వారించడంతో..

మాధవ కృష్ణ, సరితా సుమంగళి దంపతులు ఎక్కడికి వెళ్లినా తమ కుమారుడు నిషాంత్‌ను వెంట తీసుకెళ్లేవారు. ఇలా వెళ్లిన ప్రతిసారి అతడు అనారోగ్యానికి గురయ్యేవాడు. తిరువణ్ణామలైకి కూడా నిషాంత్‌ను తీసుకెళ్లేందుకు తల్లిదండ్రులు ప్రయత్నించగా.. అతడి అమ్మమ్మ, తాతయ్య వారించారు. దీంతో కుమారుడి వద్ద వారిని ఉంచి.. వీరిద్దరే వచ్చారు. దీంతో అతిపెద్ద ప్రమాదం నుంచి నిషాంత్ బయటపడ్డాడు. తల్లిదండ్రుల మృతితో అనాథగా మారాడు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి



కార్యకర్తలతో మాట్లాడుతున్న చల్లా రామచంద్రారెడ్డి

చౌడేపల్లె, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి సూచించారు. శనివారం ఆయన స్థానిక దొరబావితోట వద్ద టీడీపీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. అభివృద్ధి పనులు గుర్తిస్తే నిధులు మంజూరు చేయిస్తానని తెలిపారు. కార్యక్రమంలో కురబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఉయ్యాల రమణ, ఐటీడీపీ కుమార్, టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు రమేష్‌రెడ్డి, బాబునాయుడు, వేలూరు సుబ్రహ్మణ్యం, శంకర్‌రాజు, మహ్మద్‌గని, అమీద్‌ఖాన్, రమణ పాల్గొన్నారు.

అంబేడ్కర్ భవన్ ప్రహరీ పనుల ప్రారంభం



ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న దళిత నాయకులు

కుప్పం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కుప్పం పట్టణంలోని అంబేడ్కర్ భవన్ నిర్మాణ పనులు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా టీడీపీ దళిత నాయకులు మాట్లాడుతూ చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు ఎంపీ నిధుల నుంచి రూ.13 లక్షలు ప్రహరీ నిర్మాణానికి మంజూరైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఎంపీకి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు సుబ్బు, కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, శెట్టిపల్లె దళిత నాయకుడు ఎల్లప్ప, శాంతిపురం దళిత నాయకుడు కందస్వామి, స్పందన్, కుప్పం నియోజకవర్గ టీడీపీ విస్తరణ కమిటీ సభ్యుడు కన్నన్, మురుగేశ్, గణేశ్ పాల్గొన్నారు.

పేదల భూములకు వన్‌బీలు అందించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతులు

సోమల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కొందరి భూములను 22ఏ కేటగిరిలో చేర్చిన భూములకు వన్‌బీలు ఇవ్వాలని చినకంపల్లె, పెద్దఉప్పరపల్లె రైతులు శనివారం తహసీల్దార్ బెన్నురాజ్‌కు వినతిపత్రం అందజేశారు. కొన్ని దశాబ్దాలుగా బ్యాంకుల్లో రుణాలు పొందిన భూములను గత వైసీపీ ప్రభుత్వం రద్దు చేసి వన్‌బీలు రాకుండా అన్యాయం చేసిందన్నారు. ప్రభుత్వ రాయితీ పథకాలకు అర్హత లేకుండా చేయడంతో నిరుపేద రైతులు ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. గత నాలుగేళ్లుగా బ్యాంకుల్లో రుణాలు తీసుకొని రెన్యువల్ చేయడానికి వన్‌బీలు రావడం లేదని, ఉపాధి పనులు చేసుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాలాజీ నాయుడు, విజయ్, దుర్వాసులు నాయుడు, రెడ్డిప్రసాద్, రమణయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ



స్వీట్లు, విద్యాసామాగ్రిని అందిస్తున్న అమీర్

గుడుపల్లె, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): గుడుపల్లె మండల జనసేన అధ్యక్షులు పి అమీర్ పుట్టినరోజు సందర్భంగా శనివారం మండలంలోని గుండ్లసాగరం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆయన విద్యాసామగ్రి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అమీర్‌ను నియోజకవర్గ కూటమి నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. పార్టీ కార్యాలయంలో కేక్ కోసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో మెరిసిన జాహ్నవి



జాహ్నవి

కుప్పం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): బీసీఎన్ విద్యా సంస్థలకు అనుబంధమైన కుప్పం పబ్లిక్ స్కూల్ విద్యార్థిని జాహ్నవి జేఈఈ మెయిన్‌లో 82 శాతం పర్సంటైల్ సాధించి ప్రతిభ నిరూపించుకున్నారు. కుప్పం మున్సిపాలిటీ కమతమూరుకు చెందిన వీకే. బాలసుబ్రహ్మణ్యం కుమార్తె జాహ్నవిని స్కూల్ చైర్‌పర్సన్ శాంతా నాగరాజ్, ప్రధానోపాధ్యాయురాలు దమయంతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

బావిలో యువకుడి మృతదేహం



లభ్యమైన మృతదేహం

కుప్పం రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నాయనూరు గ్రామంలో ఓ యువకుడి మృతదేహం లభ్యమైంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. నాయనూరు గ్రామానికి చెందిన విజయ్ రెండు రోజుల క్రితం కనిపించకుండా పోయాడు. యువకుడి అదృశ్యంపై తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో గ్రామ సమీపంలోని ఓ వ్యవసాయ బావిలో శనివారం గుర్తుపట్టని రీతిలో మృతదేహం లభ్యమైంది. ఆ మృతదేహం విజయ్‌దిగా గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృత దేహాన్ని కుప్పం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

వి.కోట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): వి.కోట పట్టణంలోని బస్టాప్ వద్ద శనివారం లయన్స్ క్లబ్ అధ్యక్షులు పి.ఆర్.ధీరజ్, కార్యదర్శి మురుగేస్, కోశాధికారి లక్ష్మణ్‌చౌదరి ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. సభ్యులు సురేంద్రగౌడ, మోహన్‌రెడ్డి, గిరిధర్, డా.తమీంఖాన్, సాధాత్, కృష్ణమూర్తి, సుబ్బారెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన కృష్ణానాయక్



సీఎం చంద్రబాబు, మంత్రి సంధ్యారాణితో కృష్ణానాయక్ తదితరులు

రామకుప్పం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో శనివారం జరిగిన సంత్ సేవాలాల్ జయంతి వేడుకల్లో సీఎం చంద్రబాబు, మంత్రి గుమ్మడి సంధ్యారాణిలను రామకుప్పం మండలానికి చెందిన టీడీపీ ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షులు కృష్ణానాయక్, ధనపాల్ నాయక్ కలిశారు. జిల్లాలో వెనుకబడిన తాండాల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబును కోరినట్లు తెలిపారు. పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి కల్పిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

పోలీస్‌స్టేషన్‌కు హాజరైన వెంకటేగౌడ

గంగవరం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ శనివారం పలమనేరు పోలీస్‌స్టేషన్‌కు హాజరయ్యారు. గతంలో ఆయనపై నమోదైన కేసులో షరతులతో కూడిన బెయిల్ మంజూరైంది. ఈ మేరకు ఆయన చేరుకుని పోలీసుల ఎదుట సంతకం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మండీసుధ, మురళీకృష్ణ, శ్యామ్, కేఎం నాగరాజు, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం.. ముగ్గురి అరెస్టు



అరెస్టు చూపుతున్న పోలీసులు

గుడుపల్లె, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక నుంచి గుడుపల్లెకు అక్రమంగా ద్విచక్ర వాహనాల్లో తరలిస్తున్న రూ.27 వేలు విలువైన కర్ణాటక మద్యం, వాహనాలను గుడుపల్లె పోలీసులు స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్టు చేశారు. ఎస్‌ఐ శ్రీనివాసులు కథనం మేరకు.. గుడుపల్లె మండల సరిహద్దుల్లోని కర్ణాటక మద్యం మండలంలోని బెల్టు షాపులకు సరఫరా చేసేందుకు తరలిస్తుండగా పొగురుపల్లె-కుప్పం రహదారిలో తనిఖీ చేస్తున్న పోలీసులు పట్టుకున్నారు. కనమనపల్లెకు చెందిన సూర్యప్రకాష్(27), రాజశేఖర్(30), సత్యవేలు(29)లను అరెస్టు చేసి కేసు నమోదు చేసి రిమాండుకు పంపారు. వీరిపై గతంలోనూ కేసులు ఉన్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

ఊరకొండకు నిప్పు

సోమల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): సోమల - తిరుపతి మార్గంలోని ఊరకొండకు శనివారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మధ్యాహ్నం నుంచి మంటలు చెలరేగాయి. కొండ శివారులోని రైతులు తమ పొలాల్లోకి మంటలు వ్యాపించకుండా బోర్ల నుంచి నీటితో తడుపుకున్నారు. అడవిలోని వన్యప్రాణులు అగ్నికి ఆహుతయ్యాయి.

ఆర్‌అండ్‌బీ భవనానికి మోక్షం.!

● శరవేగంగా సాగుతున్న నిర్మాణ పనులు



కుప్పంలో జరుగుతున్న ఆర్ అండ్ బీ కార్యాలయ భవన పనులు

కుప్పం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎక్కడికక్కడ ఆగిపోయిన అభివృద్ధి పనుల్లో మళ్లీ ఇప్పుడు కదలిక మొదలైంది. కుప్పాన్ని ఎంతో అభివృద్ధి చేసేస్తామంటూ తీయటి మాటలు చెప్పిన నాటి పాలకులు చేతల్లో మాత్రం పూర్తి విరుద్ధంగా వ్యవహరించడంతో కొత్త పనులు ప్రారంభం కాకపోగా అప్పటికే ప్రారంభమైన పనులు సైతం ఆగిపోయాయి. మళ్లీ ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆగిన అభివృద్ధి పనులన్నీ ప్రారంభమై శరవేగంగా కొనసాగుతున్నాయి. అటువంటి పనుల్లో కుప్పం పట్టణంలోని రహదారులు-భవనాల శాఖ కార్యాలయ భవనం ఒకటి.

కుప్పం పట్టణం కృష్ణగిరి కూడలి సమీపంలో పూల మార్కెట్టుకు వెళ్లే దారిలో 2014- 2019 సమయంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఆర్ అండ్ బీ భవన నిర్మాణం ప్రారంభమైంది. అప్పట్లో రూ.1.06 కోట్ల అంచనా వ్యయంతో భవన నిర్మాణం ప్రారంభించారు. పనులు వెంటనే మొదలయ్యాయి. 2019లో టీడీపీ అధికారం కోల్పోయే నాటికి రూ.40 లక్షల విలువైన పనులు పూర్తయ్యాయి. బిల్లుల చెల్లింపు సైతం జరిగిపోయింది. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్ అండ్ బీ భవన నిర్మాణానికి గ్రహణం పట్టింది. కాంట్రాక్టర్ మారారు. నిర్మాణ పనులు నత్తనడకన నడిచాయి. ఎలాగోలా రూ.25 లక్షల విలువ గల పనులు పూర్తయ్యాయి. అయితే వైసీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ మధ్యలోనే భవన నిర్మాణ పనులను వదిలేసి వెళ్లిపోయారు. టీడీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చాక కుప్పంలో కక్షసాధింపు కొద్దీ వైసీపీ ప్రభుత్వం ఆపేసిన అభివృద్ధి పనులపై దృష్టి సారించింది.

ఈ క్రమంలో ఆర్ అండ్ బీ కార్యాలయ భవనం రంగంపైకి వచ్చింది. మళ్లీ నిర్మాణ పనులను ప్రారంభించాల్సిందిగా ఆర్ అండ్ బీ శాఖను ప్రభుత్వం ఆదేశించింది. ఇప్పటి వరకు జరిగిన పనులకు బిల్లులు కాకుండా కాంట్రాక్టర్లు వదిలేసిన భవనం అది. ఆర్ అండ్ బీ అధికారులు రంగంలోకి దిగారు. వెళ్లిపోయిన కాంట్రాక్టర్లలో ఒక కాంట్రాక్టరును ఎలాగోలా ఒప్పించి పనులకు దింపారు. ఇప్పుడు నిర్మాణ పనులు ప్రారంభమై పుంజుకున్నాయి. భవనం చుట్టూ ప్రహరీ నిర్మాణ పనులు ప్రస్తుతం సాగుతున్నాయి. భవన నిర్మాణం పూర్తయితే ఆర్ అండ్ కార్యాలయానికి ఒక శాశ్వత చిరునామా దొరుకుతుంది. పనులన్నింటినీ సాధ్యమైనంత త్వరలో పూర్తి చేసి భవనాన్ని వినియోగంలోకి తీసుకొస్తామని ఆర్ అండ్ బీ డీఈఈ దస్తగిరి చెప్పారు. ప్రభుత్వం పూర్తయిన పనులకు బిల్లులు చెల్లించేందుకు సిద్ధంగా ఉందని వివరించారు.

రోడ్డు ఆక్రమణల తొలగింపునకు చర్యలు



అధికారులు తొలగించిన రాతి స్తంభాలు

పలమనేరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పలమనేరు సమీపంలో బ్రిటీష్ హయాంలో ఏర్పాటు చేసిన రహదారిలో మున్సిపల్ అధికారులు ఆక్రమణలను మార్కింగ్ చేసి తొలగిస్తున్నారు. పలమనేరు మున్సిపాలిటీలోని గడ్డూరు కాలనీ నుంచి బొమ్మిదొడ్డి సమీపంలోని సోనియాకాలనీ వరకు సుమారు 2 కిలోమీటర్ల రహదారిని అప్పట్లో ఏర్పాటు చేశారు. 80 అడుగుల వెడల్పు మేర ఉన్న ఈ రహదారి దశాబ్దం క్రితం వరకు అలాగే ఉండేది. అయితే పలమనేరు డివిజన్ కేంద్రంగా, మున్సిపల్ కేంద్రంగా, మూడు రాష్ట్రాలకు కూడలిగా ఉన్నందున ఇక్కడ నివేశ స్థలాలకు విపరీతమైన డిమాండు ఏర్పడింది. దీంతో ఆక్రమణదారులు ఈ రహదారిని ఆక్రమించుకోవడం మొదలు పెట్టారు. ఇటీవల కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు సైతం రహదారి పక్కనే రహదారి స్థలాన్ని ఆక్రమించి రాతి స్తంభాలు సైతం నాటారు. దీనిపై స్థానికులు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో అధికారులు స్పందించారు. గత వారం రోజులుగా రెండు కిలోమీటర్ల పొడవునా ఆక్రమణలపై మార్కింగ్ వేశారు. రహదారి ఆక్రమించి నాటిన రాతి స్తంభాలను అధికారులు కూల్చివేశారు. రహదారి పొడవునా ఆక్రమణలు పూర్తిగా తొలగించే కార్యక్రమం చేపడుతున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు.

తాగునీటి సమస్యకు ముందస్తు చర్యలు



మాట్లాడుతున్న జడ్పీటీసీ దామోదర్‌రాజు

చౌడేపల్లె, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): వేసవి ప్రారంభం కావడంతో గ్రామాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో తాగునీటి సమస్యలు లేకుండా ఎప్పటికప్పుడు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో లీలామాధవి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయ సమావేశ భవనంలో ఎంపీపీ రామ్మూర్తి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ఏవో జ్యోతి మాట్లాడుతూ రైతులు తమ భూములకు తప్పకుండా విశిష్ట నంబరు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. జడ్పీటీసీ దామోదర్‌రాజు మాట్లాడుతూ రైతులకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వలేదని, ట్రాన్స్‌కో అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. వైద్యాధికారి నవీన్‌కుమార్ మాట్లాడుతూ క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులు చేస్తున్నామని తెలిపారు. వైస్ ఎంపీపీలు సుధాకర్‌రెడ్డి, నరసింహారెడ్డి, ఏఈ చందన, ఎంఈవో కేశవరెడ్డి, ఈవోపీఆర్డీ కృష్ణవేణి, ట్రాన్స్‌కో ఏఈ శశిధర్, కార్యదర్శులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

భూగర్భ జలాల పెంపునకు వాటర్‌షెడ్ పనులు



మొక్కలు నాటుతున్న చల్లా రామచంద్రారెడ్డి

రొంపిచెర్ల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న వాటర్‌షెడ్ పనులతో భూగర్భ జలాలు పెరుగుతాయని పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పెద్దగొట్టిగళ్లు, బండకిందపల్లె పంచాయతీల్లో జరుగుతున్న వాటర్‌యాత్ర కార్యక్రమంలో భాగంగా శ్రీనాధపురం కాలనీలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దగొట్టిగళ్లు వాటర్‌షెడ్‌లో 51 పనులకు రూ.90.5 లక్షల వ్యయం చేశారన్నారు. ఎస్సీ, ఎస్టీలకు 90 శాతం, ఇతరులకు 80 శాతం రాయితీలో రైతులకు ఉపయోగపడే పరికరాలు, టార్పాలిన్ పట్టలు, పైపులు, గడ్డి కత్తిరించే యంత్రాలు ఇస్తారని చెప్పారు. అనంతరం శ్రీనాధకాలనీలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ రైతు అధ్యక్షుడు చింతపర్తి ఓబులేశ్వరరెడ్డి, కురబ కార్పోరేషన్ డైరెక్టరు ఉయ్యాల రమణ, వాటర్‌షెడ్ చైర్మన్ అమరనాధరెడ్డి, భాస్కరయ్య, పీవో తేజశ్వీ, టీసీ రెడ్డిశేఖర్, సిబ్బంది షబీర్, దొరరాజ్, శాంతి, నాయకులు మదన్‌మోహన్‌రెడ్డి, వెంకట్రమణ పాల్గొన్నారు.

అంబేడ్కర్ భవన నిర్మాణానికి స్థలం కేటాయించండి



కడా పీడీకి వినతిపత్రం అందిస్తున్న దళిత నాయకులు

కుప్పం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కుప్పం మున్సిపాలిటీ పరిధిలో నూతనంగా అంబేడ్కర్ స్మృతి భవన నిర్మాణం కోసం 5 ఎకరాల స్థలాన్ని కేటాయించాలని దళిత నాయకులు కడా పీడీ వికాస్ మర్మత్‌ను కోరారు. శనివారం వారు కడా పీడీతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇతర కులాలకు కేటాయించినట్లే ఈ భవనానికి కావాల్సినంత స్థలం ఇవ్వాలన్నారు. అలాగే అంబేడ్కర్ భవన నిర్మాణ నమూనా జి ప్లస్ టుగా ఉండాలని సమావేశంలో నిర్ణయించారు. కార్యక్రమంలో దళిత నాయకులు కన్నన్, రాజ్‌కుమార్, డాక్టర్ వెంకటేశ్, మురుగేశ్ తదితరులు పాల్గొన్నారు.

గంగజాతర ప్రారంభం



ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లెలో బాటగంగమ్మ జాతర వేడుకలు శనివారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా బాట గంగమ్మ గెరిగెకు అర్చకులు తిప్పయ్యాచార్యులు, శ్రీనివాసాచార్యులు విశేషాలంకరణ, పూజలు నిర్వహించారు. పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. గంగ జాతర వేడుకలు ప్రశాంతంగా జరగడానికి చర్యలు తీసుకోవాలని పలమనేరు డీఎస్పీ ప్రభాకర్ సూచించారు. పోలీసు సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించి సూచనలు చేశారు.

కూటమి ప్రభుత్వాన్ని విమర్శించడం తగదు



మాట్లాడుతున్న మాధవరెడ్డి

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పదవులు అనుభవిస్తున్న వ్యక్తులు కూటమి ప్రభుత్వాన్ని విమర్శించడం తగదని టీడీపీ మండల అధ్యక్షుడు మాధవరెడ్డి సూచించారు. శనివారం పుంగనూరు ఎంపీడీవో కార్యాలయంలో వారు మాట్లాడుతూ శుక్రవారం మండల సాధారణ సమావేశంలో ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ నాగభూషన్‌రెడ్డిలు కూటమి నాయకులపై విమర్శలు చేయడం సరికాదన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు శ్రీకాంత్ సీవీరెడ్డి, పోలీసుగిరి, శమీపతి, మోహన్‌రెడ్డి, గంగాధర్, రమణ, చైతన్యరాయల్, నరేశ్‌రాయల్, సుబ్రహ్మణ్యం వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణాలకు ఆర్థిక సాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న జనసేన నేత వేణుగోపాల్‌రెడ్డి

పుంగనూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చదళ్లలో నూతన ఆలయాల నిర్మాణాలకు జనసేన నేత వేణుగోపాల్‌రెడ్డి శనివారం గొల్లపల్లెలో నిర్మిస్తున్న భండనస్వామి ఆలయం, అక్కదేవతల ఆలయానికి రూ.లక్ష, బండ్లపల్లెలో బోయకొండ గంగమ్మ ఆలయ నిర్మాణానికి రూ. 35 వేలు అందించారు. ఎన్వీఆర్ ట్రస్ట్ సభ్యులు శివకుమార్‌రెడ్డి, నరేంద్రరెడ్డి, నారాయణరెడ్డి, పాముల హరి పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

చౌడేపల్లె, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ నాగేశ్వరరావు పేర్కొన్నారు. పరికిదొన పంచాయతీ దొనపల్లెకు చెందిన మునస్వామి కుమారుడు వెంకటరమణ అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా అరెస్టు చేసి 15 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చెట్టు నుంచి పడి యువకుడి మృతి

చౌడేపల్లె, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): చింత చెట్టు నుంచి ప్రమాదవశాత్తు జారి పడి యువకుడు మృతి చెందిన సంఘటన చౌడేపల్లె మండలంలో శనివారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని బండమీదపల్లెకు చెందిన హనుమంతు కుమారుడు గంగాధర్(30) సింగిరివారిపల్లె వద్ద చింతకాయలు కోయడానికి తన భార్య శిరీషతో కలిసి వెళ్లారు. కాయలు కోస్తుండగా జారి పడ్డాడు. గాయపడిన అతడిని పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు.

సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణానికి సాయం



పుంగనూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణానికి రూ.5 లక్షలు అందజేయనున్నట్లు బీసీవై పార్టీ అధినేత రామచంద్రయాదవ్ తెలిపారు. శనివారం మండల పరిధిలోని ఏడుతాండాల గిరిజన కులస్తులు సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి చేసుకుంటున్న సందర్భంగా ఆయన విరాళాన్ని ప్రకటించారు.

స్వచ్ఛతతోనే ఆరోగ్యం పదిలం

కుప్పం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛతతోనే ఆరోగ్యం, ఆనందం చేకూరుతాయని మున్సిపల్ టీడీపీ ఫ్లోర్ లీడర్ జిమ్‌దాము అన్నారు. స్వచ్ఛాంధ్ర దివస్ కార్యక్రమంలో భాగంగా ఆయన శనివారం కుప్పం పురపాలక సంఘం 19వ వార్డు పరిధిలోని సెరికల్చర్ కార్యాలయం ప్రాంగణంలో పారిశుధ్య కార్మికులతో కలిసి పరిసరాలను పరిశుభ్రం చేశారు. టీడీపీ ముస్లిం మైనారిటీ నాయకుడు జాకీర్, జయరాం నాయుడు, బాలాజీ, చంద్ర, రాధ, జమీర్, ఉమాపతి, కిరణ్ పాల్గొన్నారు.

● సోమల: పరిసరాల పరిశుభ్రతకు అందరి సహకారం అవసరమని ఎంపీడీవో నారాయణ పేర్కొన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద స్వచ్ఛాంధ్ర దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈవోపీఆర్డీ లక్ష్మీదేవి, కార్యదర్శి జయశంకర్, నాగేశ్వరమ్మ, టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, కార్యదర్శులు పాల్గొన్నారు.

●చౌడేపల్లె: స్థానిక మండల పరిషత్తు కార్యాలయ ఆవరణలో శనివారం ఎంపీడీవో ఎంపీడీవో లీలామాధవి ఆధ్వర్యంలో పరిసరాలను శుభ్రం చేశారు.

● రొంపిచెర్ల: స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బొమ్మయ్యగారిపల్లెలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు.

● సదుం: పచ్చదనం, పరిశుభ్రత పరిరక్షణ అందరి బాధ్యత అని సదుం సీహెచ్‌సీ వైద్యాధికారిణి డా.పుష్పకుమారి పేర్కొన్నారు. సదుం ఆసుపత్రిలో శనివారం స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

అక్రమ క్వారీ సీజ్


క్రషర్ ఉన్న గదిని ధ్వంసం చేస్తున్న సిబ్బంది

నగరి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): నగరి మండలంలోని గుండ్రాజకుప్పంలోని సర్వేనెంబరు 97/1,97/4,97/3 పార్టులలోని 3.41 ఎకరాల అనాధీన భూమిలో పదేళ్లుగా అక్రమంగా కొనసాగుతున్న క్వారీని శనివారం అధికారులు సీజ్ చేశారు. అనాధీన భూమిలో క్రషర్ ఎలా ఏర్పాటు చేస్తారని గుండ్రాజుకుప్పం పంచాయతీ సర్పంచ్ బాలప్రసాద్‌రెడ్డికి ఫారమ్-7ను రెండు నెలల కిందట తహసీల్దార్ జారీ చేశారు. సర్పంచ్ దీన్ని సవాల్ చేస్తూ కలెక్టర్‌కు అప్పీలు చేశారు. కలెక్టర్ పరిశీలించి.. తహసీల్దార్ తీసుకున్న నిర్ణయం సబబేనని వెంటనే క్వారీని సీజ్ చేసి, అందులోని భవనాలను కూలదోయాలని ఆదేశించారు. ఈ మేరకు నగరి తహసీల్దార్ రవికుమార్, సీఐ మహేశ్వర్‌లు తమ సిబ్బందితో కలిసి అనాధీన భూమిలోని క్రషర్‌కు సంబంధించిన ఓ గదిని ఎక్స్‌కవేటర్‌తో కూల్చివేశారు. మరో గదిలో యంత్రసామగ్రి ఉండటంతో బుధవారం వరకు గడువిచ్చారు. యంత్రాలను తీసిన వెంటనే ఆ గదిని సైతం కూల్చివేయడం జరుగుతుందని తహసీల్దార్ తెలిపారు. ఫారమ్-6ను జారీ చేసి సుమారు రూ.3కోట్ల విలువైన భూమిని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

వృద్ధుడిని అక్కున చేర్చుకున్న 'అమ్మఒడి'



బంగారుపాళ్యం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): బొమ్మాయిపల్లె గుడిలో పూజారిగా పనిచేసిన రవీంద్రసింగ్ హజారే అనే వృద్ధుడిని చిత్తూరుకు చెందిన అమ్మఒడి అనాథ ఆశ్రమ నిర్వాహకులు అక్కున చేర్చుకున్నారు. 20 ఏళ్లుగా ఈశ్వరనాయుడికి చెందిన మామిడితోటలో ఉండేవాడు. అనారోగ్యంతో బాధపడుతుండటం, ఎవరూ లేకపోవడంతో స్థానికుల సమాచారంతో ఆశ్రమ నిర్వాహకుడు పద్మనాభనాయుడు శనివారం తన సిబ్బందితో గ్రామానికి వచ్చి వృద్ధుడిని తీసుకెళ్లారు. టిస్లా ప్రకాష్, చండీప్రభా, హుస్సేన్, జరీనా, మురళి, ఉదయ్, వాసుదేవన్ పాల్గొన్నారు.

అడవులకు నిప్పు


పాలకొండ నుంచి వస్తున్న పొగలు

పాలసముద్రం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కృష్ణజిమ్మాపురం, శ్రీకావేరిరాజుపురం పంచాయతీల పరిధిలోని పాలకొండలోని అడవులకు ఎవరో నిప్పు పెట్టారు. శనివారం పొగలు దట్టంగా వ్యాపించాయి. సమీప ప్రాంతాల్లోని పంటలకు ఎక్కడ మంటలు వ్యాపిస్తాయోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. అడవులకు నిప్పు పెడుతున్న వారిపై అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకోక పోవడం వల్లే ఇలా జరుగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

నేటినుంచి శివరాత్రి బ్రహ్మోత్సవాలు

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): గిరింపేట శివగామి సుందరి సమేత చిదంబరేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం నుంచి ఈనెల 27వ తేదీవరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ నిర్వాహకుడు కృష్ణమూర్తి తెలిపారు.

కోళ్ల నుంచి మనుషులకు 'బర్డ్ ఫ్లూ' రాదు

పశుసంవర్ధక శాఖ జిల్లా సంచాలకుడు ప్రభాకర్


సమావేశంలో ప్రసంగిస్తున్న ప్రభాకర్

పెనుమూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): బర్డ్ ఫ్లూ వ్యాధి కోళ్ల నుంచి మనుషులకు రాదని పశుసంవర్ధక శాఖ జిల్లా సంచాలకుడు ప్రభాకర్ అన్నారు. శనివారం తిరుపతి ఆకాశవాణి కేంద్రం ఆధ్వర్యంలో సీఎస్ అగ్రహారం వద్ద ఉన్న మ్యాంగో భవన్‌లో నిర్వహించిన రైతు దినోత్సవంలో ప్రసంగించారు. పశువులకు టీకాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. వ్యవసాయ సంచాలకులు సావిత్రి మాట్లాడుతూ.. రైతులు ప్రతి ఒక్కరూ విశిష్ట సంఖ్యను తీసుకోవాలని చెప్పారు. పట్టుపరిశ్రమ సహాయ సంచాలకుడు మోహన్‌బాబు మాట్లాడుతూ.. పట్టుపరిశ్రమ, మల్బరీ సాగులో భాగంగా షెడ్ల నిర్మాణానికి ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందని తెలిపారు. ఉద్యానశాఖ, ఫుడ్ ప్రాసెసింగ్, రాస్ కేంద్రం అధికారులు పలు అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఉద్యానశాఖ అధికారి నాగరిక, ఫుడ్ ప్రాసెసింగ్ జిల్లా రిసోర్స్ పర్సన్ గణేశ్, రాస్ శాస్త్రవేత్త సుధాకర్, ఉపాధి ఏపీడీ సుబ్రహ్మణ్యం, పులిగుంటీశ్వర్ వ్యవసాయ రైతు ఉత్పత్తిదారుల అధ్యక్షుడు హరికృష్ణారెడ్డి, ఆకాశవాణి అధికారులు నాగేశ్వర్‌రావు, సాయిరఘునాథ్, చరణ్, మునయ్య, శ్రీనివాసులు, రాజేష్, మురళీమోహన్, రైతులు పాల్గొన్నారు.

సంకరజాతి పశువులతో అధిక పాల ఉత్పత్తి: సంకరజాతి పశువులతో అధిక పాల ఉత్పత్తి సాధ్యమని ప్రభాకర్ తెలిపారు. పులికల్లు పంచాయతీ శింగమవాండ్లవూరులో సంకరజాతి జెర్సీ దూడల ర్యాలీలో పాల్గొన్నారు. డీడీ వాసు, ఏడీ గీతారెడ్డి, డాక్టర్ సుబ్రహ్మణ్యంపాల్గొన్నారు.

ఏడుగురికి జరిమానా

నగరి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): నగరి సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో బహిరంగ ప్రదేశంలో మద్యం తాగిన నలుగురికి రూ.4వేల (ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున) జరిమానా విధించినట్లు సీఐ మహేశ్వర్ తెలిపారు. అలాగే మద్యం తాగి వాహనాలు నడిపిన మరో ముగ్గురికి రూ.30వేల (ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున) జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.



పావడదాసూరులో కార్డన్ సెర్చ్

యాదమరి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని పావడదాసూరులో శనివారం ఉదయం ఎస్ఐ ఈశ్వర్ తన సిబ్బందితో కలిసి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సరైన రికార్డుల్లేని రెండు ట్రాక్టర్లు, రెండు ద్విచక్ర వాహనాలకు స్వాధీనం చేసుకున్నారు. ఏదైనా సైబర్ క్రైమ్ జరిగితే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

రికార్డుల్లేని ద్విచక్ర వాహనాల సీజ్

తవణంపల్లె, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రికార్డుల్లేని ఐదు ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. కార్డన్ సెర్చ్‌లో భాగంగా శనివారం షికారి కాలనీలో ఈ వాహనాలను గుర్తించినట్లు ఎస్ఐ తెలిపారు.

సారా తయారు చేస్తే కఠిన చర్యలు: డీఎస్పీ


తనిఖీలు చేస్తున్న పోలీసులు

శ్రీరంగరాజపురం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): సారా తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నగరి డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్ హెచ్చరించారు. శనివారం ఎస్ఆర్‌పురం మండలం యు.ఎం.పురం, తయ్యూరులో కార్వేటినగరం సీఐ హనుమంతప్ప, ఎస్ఐలు సుమన్, వెంకటసుబ్బయ్య, రాజ్‌కుమార్ కలసి మాట్లాడారు. యు.ఎం.పురం, తయ్యూరులో సారా తయారీ, విక్రయాలు, రవాణా జరుగుతున్నట్లు సమాచారం రావడంతో కార్డన్ సెర్చ్ నిర్వహించామన్నారు. ఐదు లీటర్ల సారా, 1500 లీటర్ల ఊటను స్వాధీనం చేసుకున్నారు.

ఇద్దరు మద్యం విక్రేతల అరెస్టు

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మద్యం అక్రమంగా అమ్ముతున్న ఇద్దరిని శనివారం అరెస్టు చేశారు. సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. బంగారుపాళ్యం దళితవాడకు చెందిన కాళెప్ప, సెల్వరాజ్‌లు మద్యం అక్రమంగా అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో దాడులు చేశారు. వారి వద్ద నుంచి 50 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

200 లీటర్ల సారా ఊట ధ్వంసం

వెదురుకుప్పం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): యనమలమంద పరిసరాల్లోని సారా స్థావరాలపై శనివారం దాడులు చేశారు. 200 లీటర్ల ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. సారా తయారీ, అమ్మకాలతో తలెత్తే చట్ట పరమైన చిక్కులపై స్థానికులకు అవగాహన కల్పించారు.

కుతూహలమ్మకు నివాళి


కుతూహలమ్మ సమాధి వద్ద నివాళి అర్పిస్తున్న హరికృష్ణ తదితరులు

గంగాధర నెల్లూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి గుమ్మడి కుతూహలమ్మ వర్ధంతి సందర్భంగా శనివారం ఆమెకు పలువురు నివాళి అర్పించారు. వింజం పంచాయతీ వి.ఎల్ క్ష్మీరెడ్డిపల్లె దళితవాడలోని ఆమె సమాధి వద్ద కుమారుడు ఆనగంటి హరికృష్ణ, సోదరి కుమారుడు సత్యవేడు వైసీపీ ఇన్‌చార్జి నూకతోటి రాజేష్, పలువురు బంధువులు పుష్పాంజలి ఘటించారు. వింజం సర్పంచ్ రామక్క, గోవిందయ్య, ఎంపీటీసీ హనీఫ్‌బాష, బాలగంగనపల్లె మాజీ సర్పంచ్ దేవరాజులు, సింగిల్‌విండో మాజీ డైరెక్టర్ బాలచంద్రారెడ్డి, వివిధ పార్టీలకు చెందిన నేతలు కూడా నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

వైభవంగా కుంభాభిషేకం


గోపూజ చేస్తున్న ఉభయదారులు

గుడిపాల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కుప్పిగానిపల్లె గ్రామ సమీపంలోని కందగిరి కొండలో శనివారం ద్వితీయ పుష్కర కుంభాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. విఘ్నేశ్వరపూజ, గణపతి పూజ, గోపూజ చేశారు. భక్తులకు మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం యాగశాల పూజ జరిగింది. ఆలయ కమిటీ సభ్యులు, మాజీ ఎంపీటీసీ సాంబశివ నాయుడు, చుట్టుపక్కల గ్రామస్తులు పాల్గొన్నారు.

బీజేపీలోకి వైసీపీ కార్యకర్తలు



విజయపురం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మల్లారెడ్డి కండ్రిగకు చెందిన వైసీపీ కార్యకర్తలు సుమారు 50 మంది శనివారం బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు చిలకం ఈశ్వర్‌ప్రసాద్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు కైలాసంయాదవ్, జిల్లా కార్యదర్శి జలజాక్షి, మండల కన్వీనర్ యుగంధర్‌రాజు, నాయకుడు పురుషోత్తం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళిత యువకుడి చేతులు నరికినవారిని కఠినంగా శిక్షించాలి: ఏఐడీఆర్ఎం

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): బుల్లెట్ నడుపుతున్నాడని సహించలేక తమిళనాడు రాష్ట్రంలోని శివగంగై జిల్లాలో దళిత యువకుడి చేతులు నరికిన అగ్రవర్ణాల వారిని కఠినంగా శిక్షించాలని ఆలిండియా దళిత్ రైట్ మూమెంట్ (ఏఐడీఆర్ఎం) జాతీయ సభ్యుడు నాగరాజు ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం దర్గా సర్కిల్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. నాయకులు మహేష్, చంద్ర, బాబు, రఘు, జలంధరన్, విజయకుమార్, రిషికేశవన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

'వినాయక సదన్'ను పరిశీలించిన ఈవో



ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కాణిపాక ఆలయానికి సంబంధించి నూతనంగా నిర్మిస్తున్న వినాయక సదన్ వసతి గృహం 2,3 అంతస్తులు పూర్తి కావడంతో శనివారం ఈవో పెంచలకిషోర్ పరిశీలించారు. త్వరలోనే వసతి సముదాయాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈఈ వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటుదాం

వెదురుకుప్పం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలని వెదురుకుప్పం జడ్పీటీసీ చలంపాళ్యం సుకుమార్ పిలుపునిచ్చారు. శనివారం మాంబేడులో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. సర్పంచ్ కవిత, గ్రామ సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రింటర్ వితరణ



వెదురుకుప్పం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): గంటావారిపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు స్థానిక యూత్ మధు బృందం ప్రింటర్‌ను శనివారం వితరణ చేసింది. ఎంఈవో దామోదరం చేతులమీదుగా పాఠశాలకు అందజేశారు.

మాజీ సర్పంచ్ మృతి

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): వేల్కూరు ఇందిరానగర్ కాలనీ దళితవాడలో మాజీ సర్పంచ్ మునెమ్మ గుండెపోటుతో శనివారం ఉదయం మరణించారు. వైసీపీ నేతలు విజయానందరెడ్డి, కృపాలక్ష్మి, వేల్కూరు బాబురెడ్డి, సీఎస్ఐ వేలూరు డయాసిస్ రెవరెండ్ బిషప్ హెన్నీశర్మ నిత్యానందం, రెవరెండ్ సురేష్, వైస్ ఎంపీపీ హరిబాబు, వెంకటరెడ్డి, జయరామన్, శేఖర్, డిల్లీ, జగదీష్ తదితరులు నివాళులర్పించారు.

'ట్రూఅప్ చార్జీలను ప్రభుత్వమే భరించాలి'



చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ట్రూ అప్ చార్జీల భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని విద్యుత్ వినియోగదారుల సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సంతపేటలో దీనికి సంబంధించిన కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. వినియోగదారులపై భారం పడే స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిర్ణయంపైనా పునరాలోచించుకోవాలన్నారు. చైతన్య తదితరులు పాల్గొన్నారు.


డస్ట్ బిన్ల పంపిణీని ప్రారంభిస్తున్న మేయర్ అముద, తదితరులు - ప్రతిజ్ఞ చేయిస్తున్న ఈఈ మునిచంద్ర - కాణిపాకంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మురళీ మోహన్

పరిసరాలను శుభ్రంగా ఉంచుకుందాం

చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి సూచించారు. స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం డీఆర్‌డీఏ, జిల్లా సమాఖ్య కార్యాలయాల ప్రాంగణాలను శుభ్రం చేశారు.

చిత్తూరు అర్బన్: దుర్గానగర్‌కాలనీ వీధిలో స్థానికులకు తడి, పొడి చెత్తను వేరు చేయడం, హోమ్ కంపోస్టింగ్ విధానాలపై అవగాహన కల్పించారు. మేయర్ అముద, కమిషనర్ నరసింహ ప్రసాద్ మాట్లాడుతూ.. నగరంలో పారిశుధ్య నిర్వహణకు ప్రజలు సహకరించాలని కోరారు. ఐహెచ్‌ఆర్‌సీ జాతీయ ప్రధాన కార్యదర్శి శోభారాణి హోమ్ కంపోస్టింగ్ తదితరాలను తెలియజేశారు. డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, ఎంహెచ్‌వో డాక్టర్ లోకేష్, వార్డుకార్యదర్శులు పాల్గొన్నారు.

ఐరాల(కాణిపాకం): ప్రతి గ్రామాన్ని, ఇంటిని పరిశుభ్రంగా ఉంచుకుందామని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ పిలుపునిచ్చారు. శనివారం కాణిపాకం ఆలయం, పంచాయతీలో స్వచ్ఛ ఆంధ్ర,స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈవో పెంచలకిషోర్, కార్యదర్శి కుసుమ,ఈఈ వెంకటనారాయణ,నాయకులు గిరిధర్‌బాబు, మధుసూదనరావు పాల్గొన్నారు.

చిత్తూరు రూరల్: వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని చిత్తూరు ఆపరేషన్ డివిజన్ ఈఈ మునిచంద్ర తెలిపారు. గాంధీ రోడ్డులో ఉన్న విద్యుత్ శాఖ కార్యాలయంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యాలయ ఆవరణాన్ని శుభ్రం చేయించారు. టౌన్ డీఈ ప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

టీచర్ల శిక్షణను తనిఖీ చేసిన డీఈవో

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన అభ్యసన బోధన విద్య విధానంపై అవగాహన పెంచుకోవాలని టీచర్లకు డీఈవో వరలక్ష్మి పిలుపునిచ్చారు. నెల్లేపల్లె హైస్కూల్లో క్లస్టర్ రిసోర్స్ సెంటర్‌లో టీచర్లకు ఇస్తున్న శిక్షణను శనివారం తనిఖీచేశారు. ఎంఈవో-2 గుణశేఖర్‌రెడ్డి, హెచ్ఎం సుబ్బరత్నమ్మ, రిసోర్సుసెంటర్ ఇన్‌చార్జి యుగంధరాచారి పాల్గొన్నారు.

అటెండెన్స్ తీరు సరికాదు: ఎస్టీయూ

వెదురుకుప్పం: క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాల ముగింపు సమయం సాయంత్రం ఐదు గంటలకే ఉన్నప్పటికీ 5.30 గంటల వరకు అటెండెన్స్ పడకుండా లాక్ చేయడం సరికాదని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి అరగొండ హేమచంద్రారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బస్సు సౌకర్యం లేనటువంటి ప్రాంతాల్లో హాజరైన వారికి, మహిళలకు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి, దివ్యాంగులకు ఇది ఎంతో ఇబ్బంది కలిగించే ప్రమాదం ఉందన్నారు. ఇకనైనా ఈ సమయాన్ని మార్చడంతో పాటు సమావేశాల ముగింపు సమయాన్ని కూడా నాలుగు గంటలకే కుదించాలని కోరారు.

రైతులకు విశిష్ట సంఖ్య తప్పనిసరి

వెదురుకుప్పం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను పొందటానికి రైతులకు విశిష్ట సంఖ్య తప్పనిసరి అని వ్యవసాయ సహాయ సంచాలకులు (ఏడీఏ) ఉమ తెలియజేశారు. జక్కిదొనలో రైతుల విశిష్ట సంఖ్యను నమోదు చేసే కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఏవో వనిత ఉన్నారు. ● కార్వేటినగరం మండలం మునిరెడ్డికండ్రిగలోనూ ఉమ తనిఖీ చేశారు. వ్యవసాయాధికారి హేమలత, ఏఈవో గాయత్రి ఉన్నారు.